

రాజమహేంద్రవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 42.0 (ఆదివారం)
కనిష్ఠం : 28.0

7
నగరం..
దుమ్మెత్తిపోతోంది!

ఏపీఈఏపీ సెట్‌లో 8,9 ర్యాంకులు మనవే

- తూర్పునకు ర్యాంకుల పంట
- 8,260 మందికి అర్హత
- ఉమ్మడి జిల్లా నుంచి నలుగురు

రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : ఏపీ ఈఏపీసెట్ - 2025లో తూర్పుగోదావరి జిల్లాకు చెందిన 8,260 మంది విద్యార్థులు క్వాలిఫై అయ్యారు. ఈ మేరకు కాకినాడ జేఎన్‌టీయూకే అధికారులు ఆదివారం ఫలితాలను విడుదల చేశారు. ఇంజనీరింగ్ స్ట్రీమ్‌లో 6,011 మంది, అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ స్ట్రీమ్‌లో 2,249 మంది అర్హత సాధించారు. అర్హత సాధించిన వారిలో ఇంజనీరింగ్ 3,390 మంది బాలురు, 2621 మంది బాలికలు ఉండగా, అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ స్ట్రీమ్‌లో 545 మంది బాలురు, 1704 మంది బాలికలు ఉన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం అర్బన్‌కు చెందిన దర్పా కార్తీక్ రామ్ కిరీటి(హాల్ టిక్కెట్ నెం.951262010302) అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ స్ట్రీమ్‌లో రాష్ట్రస్థాయిలో 8వ ర్యాంకు సాధించాడు. చాగల్లుకు చెందిన కొడవటి మోహిత్ శ్రీరామ్ 9వ ర్యాంకు సాధించాడు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం చొప్పెల్లకు చెందిన డేగల అకిరానంద వినయ్‌మల్లేష్ కుమార్ రాష్ట్రస్థాయిలో 3వ ర్యాంకు సాధించాడు. కాకినాడ జిల్లా పెద్దాపురంనకు చెందిన ఎస్.శ్రీసాయి గోవర్దన్ 6వ ర్యాంకు సాధించాడు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన నలుగురు విద్యార్థులు తొలి పది ర్యాంకుల్లో ఉండడం విశేషం.

భవిష్యత్తులో ఉన్నతస్థాయికి చేరుకోవాలి : మంత్రి దుర్గేష్

ఆంధ్రప్రదేశ్ ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ (ఏపీ ఈఏపీసెట్ - 2025)ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించిన రాష్ట్రంలోని విద్యార్థినీ విద్యార్థులకు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అభినందనలు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.భవిష్యత్తులో ఉన్నతస్థాయికి చేరుకోవాలన్నారు.

ఎంబీబీఎస్ చదవాలనేది నా లక్ష్యం



చాగల్లు : కష్టానికి తగిన ప్రతిఫలం దక్కింది. మాది చాగల్లు.. వ్యవసాయ కుటుంబం. తల్లిదండ్రులు సత్యనారాయణ, నవీన.నన్ను చదివించడానికి ఎంత గానో కష్టపడుతున్నారు. నీట్ కూడ రాశా.. ర్యాంకు సాధించి ఎంబీబీఎస్ చదువుతా.

- కొడవటి మోహిత్ శ్రీరామ్, 9వ ర్యాంకు, చాగల్లు

అమ్మానాన్నలా డాక్టర్‌ను అవుతా..



కొవ్వూరు : మాది కొవ్వూరు.. ఏపీఈఏపీసెట్‌లో 81వ ర్యాంకు సాధించా. మా అమ్మానాన్న రణధీర్‌రెడ్డి, మధులత ఇరువురు వైద్యులు. ఎంబీబీఎస్‌తో పాటు స్పెషల్ కోర్సు చేయాలన్నది లక్ష్యం. నీట్ రాశా తప్పనిసరిగా ర్యాంక్ సాధిస్తా.

-మాదిరెడ్డి వైష్ణవి,81వ ర్యాంకు, కొవ్వూరు



రాజధానిపై మాటలు.. మంటలు

రాజధాని అమరావతి, మహిళలపై అసభ్యకరంగా ప్రసారాలు చేసిన సాక్షి మీడియాపై ఆదివారం ఆగ్రహం పెల్లుబికింది.. మాటలు మంటలు చెలరేగాయి.. ఈ మేరకు అమరావతి దళిత జేఏసీ నాయకులు కొవ్వూరులో ఆదివారం ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్‌ను కలిసి వెంటనే చర్యలు తీసుకోవాలని విన్నవించారు. - 8లో



ఫైనరేజీ.. మింగేశారు!

రూ.196.17 కోట్ల సీనరేజి నిధులకు వైసీపీ ఎగనామం

- ఉమ్మడి జిల్లాలో ఇదీ లెక్క
- గత ఐదేళ్లలో పూర్తిగా వసూళ్లు
- స్థానిక సంస్థలకు ఎగవేత
- ఆర్థిక సంస్థల నిధులూ ఇంతే
- పంచాయతీరాజ్‌కు తీవ్ర అవస్థ
- పవన్ ఆదేశాలతో గుట్టురట్టు
- లెక్క తేల్చిన అధికారులు
- నివేదిక అందజేత

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇసుక కుంభ కోణం అంతా ఇంతా కాదు. అస్మదీయ కంపెనీలను అడ్డం పెట్టుకుని అప్పటి ప్రభుత్వ పెద్ద లు వేల కోట్లు దోచేశారు. ఐదేళ్ల పాటు ఇసుక దందాతో పెద్ద ఆర్థిక సామ్రాజ్యాన్నే నిర్మించుకు న్నారు.ఇసుక తవ్వకాల ద్వారా సొంత ఆదాయం పెంచుకున్న నాటి ప్రభుత్వ పెద్దలు సీనరేజీ సొమ్మును సైతం దారి మళ్లించేశారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో రీచ్‌ల పరిధిలో పం చాయతీలు, మం డల పరిషత్‌లు, జిల్లా పరి షత్‌కు ఈ డబ్బులను పంచాల్సి ఉంది.అయితే అదేదీ కాదని ఏకంగా దారి మళ్లించేశారు. ఐదేళ్ల పాటు రూ.196.17 కోట్లకు పంగ నామాలు పెట్టారు.అధికారికంగా ఇసుక తవ్వకం కంపెనీల నుంచి డబ్బులు వసూలు చేసినా వాటిని పం చాయతీలు,మండలపరిషత్, జడ్పీ ఖాతాలకు జమ చేయ లేదు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా లో వైసీపీ హయాంలో ఇసుక సీనరేజీ నిధులను ఎంత మేరకు ఎగ్గొట్టారనే దానిపై నివేదిక తయారు చేయాలని డిప్యూటీ సీఎం పవన్ ఆదేశించిన నేపథ్యంలో అధికారులు ఇటీవల గత ప్రభుత్వ నిర్వాకాన్ని బట్టబయలు చేశారు.

అంతా అడ్డగోలే..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో గోదావరి ఇసుకకు భారీ డిమాండ్ ఉంటుంది. పక్కనే ఉన్న విశాఖ నుంచి విజయవాడ వరకు అనేక నిర్మాణాలకు గోదావరి ఇసుకనే వాడతారు.గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో దాదాపు 23 వరకు రీచ్‌ల్లో ఇసుక తవ్వకాలు జరిగాయి. అత్యధికంగా కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల పరిధి లోని రీచ్‌ల్లో తవ్వకాలు ఐదేళ్ల పాటు నిరాట ఒకంగా నడిచాయి. లక్షలాది టన్నుల ఇసుకను తరలించేశారు. అధికారిక, అనధికారిక రీచ్‌ల నుంచి కోట్ల విలువైన ఇసుకను తవ్వి తర లిం చేశారు.అధికారికంగా అనుమతించిన రీచ్‌ల్లో దాదాపుగా ఇసుకను జేపీ గ్రూపు భారీ స్థాయిలో తవ్వింది.ఇలా తవ్వినందుకు ఇసుక సీనరేజీని సంబంధిత పంచాయతీలు, మండల పరిషత్‌లు, జిల్లా పరిషత్‌కు చెల్లించే నిమిత్తం ఈ కంపెనీ రాష్ట్ర ప్రభుత్వానికి చెల్లించాలి. ఆ సొమ్మును ప్రభుత్వం ఆయా పంచాయతీరాజ్ వ్యవస్థల ఖాతాలకు జమ చేయాలి. కానీ వైసీపీ తన ఐదేళ్ల పాలనలో ఇసుక ద్వారా ఖజానాకు వేల కోట్ల ఆదాయం సమకూరినా ఉమ్మడి జిల్లాలో స్థానిక సంస్థలకు నిధులు మాత్రం ఇవ్వలేదు. ఇసుక తవ్వే కంపెనీలు, సంస్థల నుంచి అధికారికంగా ఐదేళ్లు సీనరేజీ వసూలు చేసినా వాటిని దారి మళ్లించేసింది. స్థానిక సంస్థలకు పంగ నామాలు పెట్టింది. దీంతో ఏ అవసరానికీ పంచాయతీలకు డబ్బుల్లేక ఈసురోమనాల్సిన పరిస్థితి తలెత్తింది. ఇదే కాదు 14,15 ఆర్థిక సంఘం నిధులు సైతం పంచాయతీలకు ఇవ్వ కుండా మింగేసింది. చివరకు విద్యుత్ బకాయిల పేరుతో గుంజేసింది. పంచాయతీలను ఐదేళ్ల పాటు జగన్ సర్కారు నిర్వీర్యం చేసింది.



పవన్ ఆదేశాలతో గుట్టురట్టు..

గతేడాది డిప్యూటీ సీఎం పవన్ పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత కాకినాడలో అధికారులతో సమీక్షించారు. గడచిన ఐదేళ్లలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో వైసీపీ ప్రభుత్వం సాగించిన అరాచకాలపై అధికారులతో మాట్లాడారు.గత వైసీపీ ప్రభుత్వం పంచాయతీరాజ్‌శాఖ పరిధిలోకి వచ్చే సీనరేజీ ఎంత మేర దారిమళ్లించేసిందో లెక్కలు తీయాలని ఆదేశించారు.అమరావతిలో అధికారులు కొన్ని నెల ల పాటు ఫైళ్లు తిర గేసి లెక్కలు సిద్ధం చేశారు. దీని ప్రకారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఐదేళ్లలో గత జగన్ సర్కారు రూ.196.17 కోట్లు స్థానిక సంస్థలకు ఇవ్వకుండా పంగనామాలు పెట్టినట్లు లెక్క తేల్చారు.ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 2019-2021లో రూ.15.37 కోట్లు, 2021 -2022లో రూ.89.90 కోట్లు, 2022-2023లో రూ.41.50 కోట్లు,2023-2024లో రూ.36.90 కోట్లు, 2024-2025లో రూ.12.50 కోట్లు చొప్పున సీనరేజీని ప్రభుత్వం వసూలు చేసిందని నిగ్గు తేల్చారు. వీటిని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పంచాయతీలు, మండల పరిషత్‌లు, జిల్లా పరిషత్‌కు ఇవ్వలేదని నివేదికలో విశ్లేషించారు.

మీకు ఆరోగ్యం ఇస్తున్నాం.. మా సంగతో!

మునిసిపల్, కార్పొరేషన్ వాహన డ్రైవర్లకు ఆరోగ్య భద్రత కరువు

- ఈఎస్ఐ అమలు కాక ఇక్కట్లు
- ఆరోగ్యశ్రీకి దూరందూరం
- పీఎఫ్‌కు కట్..కట
- ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల వెతలు



కొవ్వూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : చెత్తను చూస్తే దగ్గరికే వెళ్లరు..ముక్కున ఖర్చీఫ్ పెట్టుకుని దూరంగా వెళ్లిపోతారు..ఎందుకంటే ఏ రోగం తమకు అంటుకుటుందోనని భయం.. అటువంటిది ఆ చెత్తను తరలించి.. వీధులను శుభ్రంగా ఉంచే వాహనడ్రైవర్లకు మాత్రం ఆరో గ్య భద్రత కరువైంది. దీంతో అనారోగ్యం పాలవుతున్నా పట్టించుకునేవారే కరవవుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా మునిసిపాలిటీలు, కార్పొరేషన్లలో సుమారు 10 వేల మంది డ్రైవర్లు అవుట్ సోర్సింగ్ విభాగంలో పనిచేస్తున్నారు. తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా 42 మంది ఉన్నారు. వీరందరికి 2024 జనవరిలో వైసీపీ ప్రభుత్వం రూ.24,500 చొప్పున వేతనాలు పెంచింది. అయితే ఈఎస్ఐ పరిధి రూ.21 వేలు కావడంతో ఆగిపోయింది. ఈఎస్ఐ లేకపోవడం, ప్రభుత్వం హెల్త్ అలవెన్స్‌లు చెల్లించడంలేదు.. అంతేకాకుండా ఆరోగ్య శ్రీ అమలు కావడంలేదు.దీంతో డ్రైవర్లు, వారి కుటుం బాలు ఆరోగ్య భద్రతపై ఆందోళన చెందుతున్నారు.ఏదైనా అనారోగ్యానికి గురైతే ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తుందని వా పోతున్నారు.మరో పక్క పీఎఫ్ పాత వేతనం రూ.15 వేలకు మాత్రమే 12 శాతం చొప్పున రూ.1800లు, ప్రొఫెషనల్ టాక్స్ రూ.200లు కలిపి రికవరీ చేస్తూ ఒక్కొక్క ఉద్యోగి నుంచి రూ.2వేలు చొప్పున కట్ చేస్తున్నారు. రూ.24,500ల పూర్తి వేతనంపై పీఎఫ్ రికవరి చేయాలని డిమాండ్ చేస్తున్నారు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణించడంతో కనీస వేతనాలు అమలు కాకపోగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందడం లేదు. పెరుగుతున్న ధరలతో కుటుంబపోషణ కష్టసాధ్యంగా మారిందని కన్నీటి పర్యంతమవుతున్నారు.కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలను వర్తింపచేయాలని కోరుతున్నారు. గత 18 నెలలుగా యూనియన్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని అధికారులను కోరినా ఫలితం లేదని వాపోతున్నారు.కూటమి ప్రభుత్వంలో న్యాయం చేయాలని ఎమ్మెల్యేలను వేడుకుంటున్నారు.

ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలి



మునిసిపాలిటీల్లో అవుట్‌సోర్సింగ్ విభాగంలో పనిచేస్తున్న డ్రైవర్లకు పూర్తిస్థాయిలో పీఎఫ్,ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలి. కేంద్ర ప్రభుత్వ హెల్త్ అలవెన్సు రూ.6 వేలు అందించాలి. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులందరికి ప్రభుత్వ పథకాలు వర్తింపచేయాలి.

- రాజాన అప్పారావు, సంఘ కొవ్వూరు మునిసిపల్ జేఏసీ అధ్యక్షుడు

రాజధానిలో 10 ఎకరాలు కేటాయించాలి

ఎమ్మెల్యే గోరంట్లకు కడియం నర్సరీ రైతుల వినతి

కడి యం, జూన్ 8(ఆంధ్రజ్యోతి): కడియం నర్సరీ రంగానికి తోడ్పాటు నిస్తూ అమరావతి ప్రాంతంలో బొటానికల్ గార్డెన్, బయోడైవర్సిటీ కేంద్రం ఏర్పాటుకు 10 ఎకరాల భూమిని కేటాయించాలని నర్సరీ సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరిని ఆదివారం నర్సరీ సంఘం అధ్యక్షుడు రత్నం అయ్యప్ప, ఉపాధ్యక్షుడు బోడపాటి గోపి కలిసి వినతిపత్రం అందించారు. అమరావతి ప్రాంతంలో కడియం నర్సరీరంగానికి 10 ఎకరాల భూమి కేటాయిస్తే థాయ్ లాండ్ తరహాలో చాటుచక్ లాంటి మార్కెట్ ఏర్పాటు చేస్తామని, దీని ద్వారా నర్సరీరంగానికి చెందిన చిన్న, సన్నకారు రైతులు అభివృద్ధి చెందుతారన్నారు. ఈ కార్యక్రమంలో నర్సరీ సంఘ సభ్యులు కొండేపూడి నాగు, తాడాల నాగేశ్వరరావు, పిల్లా శ్రీను, గాద నాగేశ్వరరావు, కొవ్విడి వాసు తదితరులు ఉన్నారు.



ఎమ్మెల్యే గోరంట్లకు వినతిపత్రం అందజేస్తున్న కడియం నర్సరీ అసోసియేషన్ రైతులు



పట్టుబడిన రేషన్ బియ్యం

రూ.13 లక్షల విలువైన పీడీఎస్ బియ్యం పట్టివేత

రాజానగరం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం లారీని రాజానగరంలో సివిల్ సప్లయిస్ అధికారులు పట్టుకున్నారు. ముందుగా అందిన సమాచారం మేరకు జాతీయ రహదారిలో బీపీసీఎల్ పెట్రోల్ బంకులో ఏపీ39 -వి3299 నెంబరు కలిగిన అశోక్ లేలాండ్ లారీ పార్క్ చేసి ఉండగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తనిఖీ చేసి పీడీఎస్ బియ్యం ఉన్న లారీని పట్టుకున్నట్టు రాజానగరం సివిల్ సప్లయిస్ డీటీ బాపిరాజు తెలిపారు. ఈ లారీ పల్నాడు జిల్లా నకిరేకల్లుకు చెందిన బెజ్జం రవీంద్రరెడ్డిదిగా గుర్తించామన్నారు.లారీ డ్రైవర్ పరారయ్యాడన్నారు.పట్టుబడిన లారీలో బస్తాలతో 28,090 కిలోలు బియ్యం ఉన్నాయని,వీటి విలువ రూ.12,92,140గా గుర్తించామన్నారు. లారీ విలువ రూ.20 లక్షలుగా నిర్ధారించామన్నారు. పరారీలో ఉన్న డ్రైవర్‌పై రాజానగరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు డీటీ తెలిపారు.


ప్రజల చెంతకు పాలన

పాలనలో ప్రభుత్వం నూతన ఒరవడి

- కలెక్టరేట్‌లో డీవీఏపీ యూనిట్
- నియోజకవర్గానికో యూనిట్
- 40 మంది ఉద్యోగుల నియామకం
- అభివృద్ధి, సంక్షేమ అంశాలు సేకరణ
- మౌలిక వసతులు, సమస్యలపై ఆరా
- 11న ప్రారంభోత్సవాలు
- 12న ఏడాది పాలన సంబరాలు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వం ఏర్పడి ఏడాది అవుతుంది. ఏడాది పాలన ఉత్సవాలను ఘనంగా నిర్వహించ నున్నారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం పాలనలో నూతన ఒరవడిని తెచ్చింది. ప్రభుత్వం ఏర్పడి ఈ నెల 12వ తేదీకి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా అనేక కార్యక్రమాలను చేపట్టనుంది. 11వ తేదీన జిల్లా వ్యాప్తంగా ఏడు నియోజక వర్గాల్లో పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్నారు. 12న అమరావతిలో ఘనంగా వేడుకలు నిర్వహించనున్నారు. ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేల సూచనల మేరకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల జాబితాలను అధికారులు సిద్ధం చేస్తున్నారు.ఇక సోమవారం నూతన ఒరవడికి శ్రీకారం చుడుతున్నారు.స్వర్ణాంధ్ర ప్రదేశ్ విజన్ యూనిట్‌ను రాష్ట్ర స్థాయిలో, డిస్ట్రిక్ట్ విజన్ యూనిట్ జిల్లా స్థాయిలోనూ, నియోజకవర్గ విజన్ యూనిట్ నియోజక వర్గ హెడ్ క్వార్టర్‌లోనూ ప్రారంభించనున్నారు. ఒక్కో యూనిట్‌లో ఐదుగురు సచివాలయ ఉద్యోగులను నియమించారు. జిల్లా యూనిట్‌కు చైర్మన్‌గా కలెక్టర్ పి.ప్రశాంతి వ్యవహరిస్తారు. నియోజకవర్గ యూనిట్లకు ఎమ్మెల్యేలు చైర్మన్లుగా ఉంటారు. కన్వీనర్లుగా నియోజకవర్గ ప్రత్యేకాధికారులు ఉంటారు.జిల్లాలో రాజమండ్రి సిటీ, రాజమండ్రి రూరల్, రాజానగరం, అనపర్తి, కొవ్వూరు, నిడదవోలు, గోపాలపురం నియోజకవర్గాల హెడ్ క్వార్టర్లలోని మండల పరిషత్ కార్యాలయాల్లో నియోజకవర్గస్థాయి విజన్ యూనిట్లు ప్రారంభించనున్నారు. ఇక్కడ ఒక్కో యూనిట్‌కు ఐదుగురు వంతున సచివాలయ ఉద్యోగులు ఉంటారు. వీరిని నడిపించడానికి ఒక ప్రొఫెషనల్ ఉంటారు. మొదట వీరంతా తమ పరిధిలోని నియోజకవర్గాల్లో ఎంత జనం ఉన్నారు. ఏఏ పథకాలు ఎవరికి అందుతున్నాయి. ఇంకా అందుకోవాల్సిన వారెంతమంది అనే వివరాలు లెక్కిస్తారు.ప్రస్తుతం మండల స్థాయి వరకూ వివరాలు సేకరిస్తున్నారు. తర్వాత గ్రామ స్థాయి నివేదికలు ఇవ్వనున్నారు. ప్రస్తుత నివేదికలను జిల్లా విజన్ యూనిట్‌కు ఎప్పటికప్పుడు పంపిస్తున్నారు.వీటి ఆధారంగా ప్రజల జీవన ప్రమాణాలు, వారి ఆర్థిక పరిస్థితి,ఆయా ప్రాంతాల అభివృద్ధి, సమస్యలు, తదితర వివరాలు పొందుపర్చనున్నారు. ముందుగా ఆయా మండలాల్లో జరగాల్సిన పనులు కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తారు.



మండలస్థాయి విజన్ అమలు

జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో మండల స్థాయి విజన్ కార్యాచరణ ప్రణాళిక అమలు చేయనున్నట్టు కలెక్టర్ పి. ప్రశాంతి తెలిపారు. ఆయా ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో ఈ విజన్ యూనిట్లను ఏర్పాటు చేస్తు న్నామన్నారు. మొత్తం 40 మంది సచివాలయ ఉద్యోగులతో యూనిట్లు ఏర్పాటు చేస్తున్నామ న్నారు. 2024-29కి ఐదేళ్ల మండల విజన్ కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తామన్నారు. **- కలెక్టర్ ప్రశాంతి**

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ ప్రతిష్ఠాపన

కోరుకొండ, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : కోరుకొండలో శ్రీ వల్లి దేవసేన సుబ్రహ్మణ్యేశ్వర నూతన ఆలయ ప్రతిష్ఠాపన ఆదివారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయంలో శ్రీ వల్లిదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి విగ్రహాలు, విఘ్నేశ్వర, అయ్యప్ప, మయూరం,నాగబంధంతో కూడిన విగ్రహాలను 50 అడుగల ఏకశిల ధ్వజస్థంభం, ఆలయ శిఖర ప్రతిష్ఠ ఆగమ పండితులు శాస్త్రోక్తంగా ప్రతిష్ఠించారు. గత మూడు రోజులుగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు ఆగమ బ్రహ్మలు పాణింగపల్లి సత్య పవన్‌కుమార్ ఆచార్యులు, బ్రహ్మశ్రీ ఇంద్రగంటి విశ్వనాథ శర్మలు బ్రహ్మత్వంలో దిగ్విజయంగా నిర్వహించారు. నిడమనూరి శ్రీ వెంకట ఆదినారాయణ దంపతులు పీటలపై కూర్చుని 3 రోజులు ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. రూ.2 కోట్లతో ఆలయాన్ని నిర్మించినట్టు నిర్వాహకులు తెలిపారు. ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ హాజరై రూ.5 లక్షలు విరాళం అందజేశారు. మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, యువజన నాయకుడు జక్కంపూడి గణేష్, స్వామివారిని దర్శించుకున్నారు. బీజేపీ నాయకుడు, విశ్వహిందూ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు స్వామివారిని దర్శించుకుని కార్తీక మాసం వచ్చేనాటికి రూ.25 లక్షల విలువైన బంగారు వేలాయుధంను సమకూరుస్తానని ప్రకటించారు. ఈ మేరకు రూ.లక్ష చెక్కును ముందుగా కమిటీ వారికి అందజేశారు. ఆదివారం జరిగిన అన్న సమారాధనకు ఒక టన్ను బియ్యం, రూ.1.50 లక్షలు విరాళం అందజేశారు. మాగంటి శ్రీనివాసులు రూ.5 లక్షలతో 50 అడుగుల ఏకశిలధ్వజస్థంభం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు ఉల్లి బుచ్చిబాబు, ఉపాధ్యక్షుడు బదిరెడ్డి దొర, వంటిపల్లి సత్యనారాయణ,తాడిహరిశ్చంద్రప్రసాద్ రెడ్డి, కటకం సత్యనారాయణ పాల్గొన్నారు.



కోరుకొండలో నిర్మించిన ఆలయంలో ప్రతిష్ఠించిన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి విగ్రహాలు










దుమ్మెత్తిపోతోంది!

» దారుణంగా రాజమహేంద్రవరం - మల్లయ్యపేట పెట్రోల్ బంక్ రోడ్డు » ప్రజలకు అవస్థలు

రాజమహేంద్రవరం- మల్లయ్యపేట పెట్రోల్ బంక్ రోడ్డు పరిస్థితి దుమ్ము, ధూళితో నానాటికి దారుణంగా మారుతోంది. కోటిలింగాల ఇసుక ర్యాంప్‌ల నుంచి వచ్చే భారీ లారీల దెబ్బకు తారు రోడ్డు కాస్తా మట్టి, ఇసుక పర్రలా మారిపోతోంది. ద్విచక్ర వాహనదారులు ఇసుక దారిలో జారి పడి గాయాలపాలవుతున్నారు. ఆర్టీసీ, ప్రవేట్ ట్రావెల్స్ బస్సులు ఈ రోడ్డుగుండానే ఎక్కువగా వెళ్తుంటాయి. ఇసుక లోడు లారీలు ఫుల్‌గా లోడ్ వేసుకుని వస్తూ దారిలో ఇసుకను వేస్తున్నాయి. అది రోడ్డుపై ఇతర వాహనాల కింద నలిగి మట్టిగా మారిపోయి రోడ్డంతా దుమ్ముతో నిండిపోతోంది. ఈ దుమ్ము వల్ల ఎదురుగా వచ్చే వాహనాలు కూడా కనిపించని పరిస్థితి ఉంది. రోజు రోడ్డు పక్కన ఉన్న వ్యాపారస్తులు, గృహాల్లో ఉండేవారు ఉదయం, సాయంత్రం బాకెట్లతో మట్టిని ఎత్తుకుని పారబోసే పరిస్థితి ఉంది. ద్విచక్రవాహనదారులు దుమ్ములో ఇబ్బందులు పడుతూ ప్రయాణం చేస్తున్నారు. రోడ్డులో దుమ్ము, ఇసుక కళ్లల్లో పడి అవస్థలు పడుతున్నామని, రెప్పపాటులో ప్రమాదాలు జరిగే అవకాశంఉందని భయాందోళన చెందుతున్నారు.

- రాజమహేంద్రవరం సిటీ (ఆంధ్రజ్యోతి)

సీలేరు నదిలో గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

మోతుగూడెం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా చింతూరు మండలం మోతుగూడెంలో పిక్నిక్ స్పాట్ వద్ద సీలేరు నదిలో కొట్టుకుపోయిన అభిలాష్ (18) మృతదేహం ధారాలమ్మ గుడి వెనక నదిలో ఆదివారం లభ్యమైంది. శనివారం మధ్యాహ్నం ఒంటిగంట నుంచి గజ ఈతగాళ్లతో మోతుగూడెం ఎస్ఐ సాధిక్, పోలీసు సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి జి.మోహన్, ఆర్ఐ విగ్నేష్, వీఆర్వో రెవెన్యూ సిబ్బందితో గాలింపు చేపట్టగా ఆదివారం మధ్యాహ్నం నదిలోని రాళ్ల మధ్యలో ఇరుక్కుపోయిన యువకుడి మృతదేహాన్ని గుర్తించి ఒడ్డుకు తీసుకువచ్చారు. పోస్టుమార్టం నిమిత్తం చింతూరు ప్రభుత్వాసుపత్రికి తరలించినట్టు ఎస్ఐ సాధిక్ తెలిపారు. ప్రస్తుతం సీలేరు నది ప్రవాహం ఎక్కువ తక్కువ అవుతున్న కారణంగా సాధ్యమైనంత వరకు నదిలో దిగడం, ఈత కొట్టడం మానుకోవాలని పర్యాటకులకు ఆయన సూచించారు.



అభిలాష్ మృతదేహం

హెచ్చరిక బోర్డుల ఏర్పాటు

మోతుగూడెంలో పిక్నిక్ స్పాట్ వద్ద సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ డి.కామేశ్వరరావు ఆదేశాల ప్రకారం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వరప్రసాద్ ఆధ్వర్యంలో సివిల్ ఏడీఈ కొండబాబు పర్యవేక్షణలో పొల్లూరు సివిల్ అధికారులు ఆదివారం సాయంత్రం ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ నది తీరంలో ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో లోయర్ సీలేరు ఏపీ జెన్కో సివిల్ డివిజన్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ధారాలమ్మ గుడి వద్ద సిబ్బంది హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు.



హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

ఊపిరితిత్తుల సమస్యతో గిరిజన బాలిక మృతి

ఎటపాక, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ఊపిరితిత్తుల సమస్య (ఇన్‌పెక్షన్)తో గిరిజన బాలిక మృతిచెందిన ఘటన అల్లూరి జిల్లా ఎటపాక మండలం విస్సాపురం గ్రామంలో శనివారం రాత్రి జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వాడే సంధ్య (13) గత నెల రోజులుగా ఊపిరితిత్తుల సమస్యతో బాధ పడుతుంది. బాలిక పట్ల తల్లిదండ్రులు నాటు మందు ఇచ్చేవాడిని ఆశ్రయించారు. బాలికకు అప్పుడప్పుడు జ్వరం రావడంతో ఆర్ఎంపీల వద్ద తరచూ చికిత్స చేయించడంతో కిడ్నీ సమస్య కూడా వచ్చినట్టు తెలిసింది. ఆరోగ్య పరిస్థితి విషమించడంతో భద్రాచలం, ఖమ్మం, హైదారాబాద్‌కు తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయింది. బాలిక చింతూరు ఆశ్రమ గర్ల్స్ హైస్కూల్‌లో ఏడో తరగతి పూర్తి చేసింది.



సంధ్య (ఫైల్)

హెల్మెట్ ఉన్నా..ఆగిన ఊపిరి!

ద్విచక్రవాహనం అదుపుతప్పి మహిళ మృతి

కుమారుడు, సోదరికి తీవ్ర గాయాలు

పిఠాపురం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం బైపాస్‌రోడ్డులో ఆదివారం సాయంత్రం జరిగిన ప్రమాదంలో మహిళ మరణించగా కుమారుడు, సోదరికి తీవ్ర గాయాలయ్యాయి. ఆమె ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తూ హెల్మెట్ పెట్టుకున్నప్పటికీ కింద బెల్ట్ పెట్టుకోకపోవడంతో తలకు గాయాలై చనిపోయింది. బెల్ట్ పెట్టుకోకపోవడంతో హెల్మెట్ ఊడిపోయి తలకు బలమైన గాయాలైనట్టు పోలీసులు గుర్తించారు. గొల్లప్రోలు మండలం దుర్గాడ గ్రామానికి చెందిన ఇంటి మమత(32) గొల్లప్రోలులోని మాధురి విద్యాలయంలో ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు. తన కుమారుడు సుహాస్ (8), సోదరి జగ్గంపేటకు చెందిన పెనుమర్తి సోమలత(17)తో కలసి దుర్గాడ నుంచి ద్విచక్రవాహనంపై బయలుదేరారు. కాకినాడలో దంత పరీక్షల నిమిత్తం వైద్యుడి వద్ద అపాయింట్‌మెంట్ తీసుకుని వెళ్తుండగా రాపర్తి జంక్షన్ సమీపంలో గేదె అడ్డుగా రావడంతో అదుపు తప్పి పడిపోయారు. తీవ్రంగా గాయపడిన మమత అక్కడిక్కడే మరణించగా, సుహాస్, సోమలతకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం కాకినాడలోని ప్రవేటు ఆసుపత్రికి తరలించారు. మమత భర్త నాగేశ్వరరావు వ్యవసాయం చేస్తున్నారు. మమత సహచర ఉపాధ్యాయులు, బంధువులు, కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. పిఠాపురం ఎస్ఐ మణికుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.



మరణించిన మమత (ఫైల్)

కరెంటుషాక్‌తో యువకుడి మృతి!

కొత్తపల్లి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం తీరప్రాంతంలో ప్రముఖ కంపెనీలో యువకుడు కరెంటు షాక్‌తో మృతిచెందినట్టు తెలిసింది. కేఎస్ఈజెడ్‌లో రొయ్యల శుద్ధి చేసే కంపెనీలో కూలీపనులు చేస్తున్న ఒక యువకునికి కరెంటు షాక్ తగలడంతో అక్కడికక్కడే మృతిచెందాడనేది సమాచారం. కంపెనీ ప్రతినిధులు గుట్టు చప్పుడు కాకుండా మృతుడి బంధువులకు అప్పగించారని సమాచారం. దీనిపై కొత్తపల్లి పోలీసులను వివరణ కోరగా తమకు ఎటువంటి ఫిర్యాదురాలేదని ఎస్ఐ జివెంకటేష్ తెలిపారు.

చెరువు మట్టి తవ్వకాల్లో వివాదం
జనసేన నేతల మధ్య ఘర్షణ

పిఠాపురం రూరల్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం మండలం ఎఫ్‌కే పాలెం, విరవాడ గ్రామాల పరిధిలో ఉన్న పాపిడిదొడ్డి చెరువులో జరుగుతున్న మట్టి తవ్వకాల్లో ఆదివారం వివాదం జరిగింది. జనసేన నాయకుల మధ్య ఘర్షణ చోటు చేసుకుని ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. చెరువులో మట్టి తవ్వకాలకు ఒక మహిళా రైతు పేరుపై అనుమతి తీసుకువచ్చి కొన్ని రోజులుగా తవ్వకాలు సాగిస్తూ మట్టిని విరవాడ, ఎల్ఎన్‌పురం, నరసింగపురం, కోలంక, విరవ తదితర గ్రామాల్లోని ఇటుక బట్టీలకు తరలిస్తున్నారు. ఇటుకబట్టీల తరలింపు విషయంలో జనసేన నాయకుల మధ్య వివాదం సాగుతోంది. ఈ నేపథ్యంలో ఆదివారం తవ్వకాలు జరుగుతున్న ప్రాంతానికి విరవ గ్రామానికి చెందిన పిఠాపురం మాజీ ఎంపీపీ కురుమళ్ల రాంబాబు చేరుకున్నారు. తవ్వకాలు సాగుతున్న తీరు సరిగా లేదని, గడువు ముగుస్తున్నా అన్ని ప్రాంతాలకు మట్టి సరఫరా చేయడం లేదని అభ్యంతరం తెలిపారు. అదే సమయంలో దీనికి విరవాడ గ్రామానికి చెందిన బొజ్జా రాంప్రసాద్ అభ్యంతరం చెబుతూ వాగ్వావాదానికి దిగారు. ఇది ఇరువర్గాల ఘర్షణకు దారి తీసి ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు.

పోలీసులకు పరస్పరం ఫిర్యాదులు

దీనిపై ఇరువురు తమపై దాడి జరిగిందని, బంగారు వస్తువులు పోయాయని పరస్పరం పిఠాపురం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై ఫిర్యాదులు అందాయని, విచారణ జరుపుతున్నామని రూరల్ ఎస్ఐ జానీబాషా తెలిపారు. కాగా మట్టి తవ్వకాల వద్ద జనసేన నాయకులు బహిరంగంగా ఘర్షణకు దిగడం పిఠాపురం నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది.

రత్నగిరిపై అనంతలక్ష్మి సత్రం స్థల పరిశీలన



సత్రం స్థల పరిశీలన చేస్తున్న చీఫ్ ఇంజనీర్

అన్నవరం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో రూ.11.40 కోట్లతో 105 గదులతో నిర్మించబోయే అనంత లక్ష్మి సత్రం స్థలాన్ని ఆదివారం దేవదాయశాఖ చీఫ్ ఇంజనీర్ శేఖర్ పరిశీలించారు. ఇప్పటికే టెండర్లు పిలవగా అనుమతి కోసం దేవదాయక మిషనర్‌కు లేఖ రాయడంతో కమిషనర్ ఆదేశాలతో పరిశీలించారు. దీనిపై నివేదికను కమిషనర్‌కు అందజేసి తదనంతర ఆదేశాలతో టెండర్‌ను ఖరారు చేయనున్నట్టు దేవస్థానం అధికారులు తెలిపారు. ప్రస్తుతం ఉన్న సీతారామ సత్రం పడగొట్టి ఆ ప్రాంతంలో కొత్త నిర్మాణం చేపట్టాలని టెండర్లు పిలిచారు. అయితే సీతారామ సత్రం పడగొట్టకుండా మరమ్మతులు చేపడితే సరిపోతుందని దేవదాయశాఖ ఇంజనీరింగ్ బృందం సూచించింది. దీంతో ఆ భవనం అలానే ఉంచి నూతనంగా వేరే ప్రదేశంలో నిర్మించాలని సూచించారు. దీంతో సత్యగిరి కొండపై నిర్మించాలని సూచించారు. ఈమేరకు విష్ణుసదన్ హాల్స్ ఎదురుగా నిర్మించాలని నిర్ణయించారు.

వివాదాస్పదమైన వివాహ డెకరేషన్ మండపం ఏర్పాటు

సత్యదేవుడి సన్నిధిలో ఆదివారం ఉదయం వివాహం చేసుకునేందుకు ఒక బృందం 2రోజుల క్రితం డెకరేషన్ మండపాల లీజుదారులను కలవగా వారు చెప్పిన ధరకు అంగీకరించపోవడంతో ఇతర ప్రాంతం నుంచి డెకరేషన్ మండపాన్ని తెప్పించుకోగా లీజుదారులు అడ్డుకున్నారు. తాము నిర్ణీత మొత్తం దేవస్థానానికి చెల్లిస్తున్నామని ఎందుకు అడ్డుకుంటున్నారని ప్రశ్నించారు. వివాదం ఈవో దృష్టికి చేరడంతో బయట నుంచి డెకరేషన్ మండపం ఏర్పాటు చేసుకుంటే నిర్ణీత రుసుం పెళ్లి బృందం వద్ద తీసుకుని అనుమతించాలని చెప్పడంతో వివాదం ఆగింది.

ఏపీఈఏపీసెట్ ఫలితాలు విడుదల

- ఉమ్మడి జిల్లాలో ఇంజనీరింగ్‌లో అర్హత సాధించిన 15,220మంది విద్యార్థులు
- అగ్రికల్చర్ ఫార్మసీలో అర్హులైన 6,710 మంది విద్యార్థులు
- ఫలితాలను విడుదల చేసిన సెట్ చైర్మన్, జేఎన్టీయూకే వీసీ సీఎస్ఆర్కే ప్రసాద్

జేఎన్టీయూకే, జూన్8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జేఎన్టీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన ఏపీఈఏపీసెట్-2025 ఫలితాలను సెట్ చైర్మన్, ఉప కులపతి ప్రొఫెసర్ సీఎస్ఆర్కే ప్రసాద్ ఆదివారం సాయంత్రం విడుదల చేశారు. కాకినాడ, తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లో ఇంజనీరింగ్‌లో మొత్తం 15,220 మంది ఉత్తీర్ణత సాధించగా.... అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షలో 6,710మంది ఉత్తీర్ణులైనట్టు తెలిపారు. కాకినాడ జిల్లాలో అగ్రికల్చర్ ఫార్మసీ పరీక్షకు 3,683మంది దరఖాస్తు చేసుకోగా 3,431 మంది హాజరుకాగా 3,077మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. అదేవిధంగా తూర్పుగోదావరి జిల్లాలో అగ్రికల్చర్ ఫార్మసీ పరీక్షకు 2585మంది దరఖాస్తుచేసుకోగా 2387 మంది హాజరుకాగా 2249 మంది ఉత్తీర్ణత సాధించినట్టు తెలిపారు. కోనసీమ జిల్లాలో అగ్రికల్చర్ ఫార్మసీ పరీక్షకు 1601 మంది దరఖాస్తు చేసుకోగా 1510 మంది హాజరుకాగా 1384 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. కాకినాడ జిల్లాలో ఇంజనీరింగ్ పరీక్షకు 8986 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 8666 మంది హాజరుకాగా 6343 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. తూర్పుగోదావరి జిల్లాలో ఇంజనీరింగ్ పరీక్షకు 7649 మంది దరఖాస్తు చేసుకోగా 7416 మంది హాజరుకాగా 6011మంది ఉత్తీర్ణత సాధించినట్టు తెలిపారు. కోనసీమ జిల్లాలో ఇంజనీరింగ్‌లో పరీక్షకు 4,036 మంది దరఖాస్తుచేసుకోగా 3,891 మంది హాజరుకాగా 2,866 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. కార్యక్రమంలో కన్వీనర్ వీవీ సుబ్బారావు, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ రవీంద్రనాథ్, ఓఎస్డీ కోటేశ్వరరావు, కన్వీనర్లు రాము, సుమతి, సమన్వయకర్తలు చంద్రశేఖర్, జయప్రసాద్, ఉషాదేవి పాల్గొన్నారు.

కవలలకు ర్యాంకులు



వేజిత్, వేహితలకు మిఠాయిలు తినిపిస్తున్న తల్లిదండ్రులు

సామర్లకోట, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట కొత్తూరు వీధికి చెందిన ఉపాధ్యాయులు యలమాటి శ్రీనివాసు-అరుణ దంపతుల కుమారుడు వేజిత్‌కు ఇంజనీరింగ్ విభాగంలో రాష్ట్రస్థాయిలో 96వ ర్యాంకు, కుమార్తె వేహితకు 172 ర్యాంకు లభించింది. వీరిద్దరూ కవలలు. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ర్యాంకులు రావడంతో ఐఐటీలో చేరేందుకు మక్కువ కనబరుస్తున్నారని తల్లిదండ్రులు చెప్పారు.

ఏపీఈఏపీసెట్‌లో 'తిరుమల' ప్రభంజనం

రాజమహేంద్రవరం రూరల్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఏపీ ఈఏపీ సెట్ (ఇంజనీరింగ్, అగ్రికల్చరల్ అండ్ ఫార్మసీ) ఫలితాల్లో తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని తిరుమల ఐఐటీ అండ్ మెడికల్ అకాడమీ విద్యార్థులు రాష్ట్రస్థాయిలో 3వ ర్యాంకు, 8వ ర్యాంకు సాధించారని విద్యా సంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. ఇంజనీరింగ్ విభాగంలో కె.యశ్వంత్ సాత్విక్ స్టేట్ 3వ ర్యాంకు, ఎ.శ్రీహర్ష 20వ ర్యాంకు, కె.యశ్వంత్ రాజా 26వ ర్యాంకు, సీహెచ్ సాయి కేశవరామ్ 27వ ర్యాంకు, వి.తేజశ్రీ 31వ ర్యాంకు, కె.ప్రణీత్ 36వ ర్యాంకు, బి.సాయి శ్రీకర్ 66వ ర్యాంకు, కె.శంకర్ మానిక్ 77వ ర్యాకు, కె.వినీష్ 93 ర్యాంకు.. 100లోపు 9, 1000లోపు 142, 2000లోపు 280, 5000లోపు 626, 10000లోపు 1012 మంది సాధించారని పేర్కొన్నారు. అగ్రికల్చరల్ విభాగంలో డి.కిరీటి స్టేట్ 8వ ర్యాంకు, ఎం.సంతోష్ రెడ్డి 12వ ర్యాంకు, ఎల్.అభిషేక్ 39వ ర్యాంకు, కె.నాగసాయిపవన్ 47వ ర్యాంకు, టి.సాహితి 55వ ర్యాంకు, కె.కశ్యప్ 58వ ర్యాంకు, పి.దినేష్ 73వ ర్యాంకు, టి.రామచంద్రన్ 77వ ర్యాంకు, ఎం.వైష్ణవి 81వ ర్యాంకు కైవసం చేసుకున్నారని.. 100లోపు 9 మంది, 1000 లోపు 85 మంది, 2000లోపు 140 మంది, 5000లోపు 272 మంది, 10000లోపు 415 మంది ర్యాంకులు సాధించారని తెలిపారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను అకడమిక్ డైరెక్టర్లతో కలిసి తిరుమలరావు అభినందించారు.



ఉన్నత ర్యాంకులు సాధించిన కె.సాత్విక్, డి.కిరీటి

ఎలక్ట్రీషియన్ల రక్షణ, భద్రతకు ప్రాధాన్యం

డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్

పిఠాపురం నియోజకవర్గంలో

325మందికి సేఫ్టీకిట్ల అందజేత

పిఠాపురం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రాణాలపణంగా పెట్టి పనిచేసే ఎలక్ట్రీషియన్ల రక్షణ, భద్రతకు ప్రాధాన్యమివ్వాలని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సూచించారు. మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో ఆదివారం పిఠాపురం నియోజకవర్గంలోని 325 మంది ప్రవేటు ఎలక్ట్రీషియన్లకు పని ప్రదేశాల్లో రక్షణ, భద్రత కోసం సేఫ్టీకిట్లను అందజేశారు. ఒక్కొక్కటి రూ.5వేలు విలువ చేసే ఈ సేఫ్టీకిట్‌లో ఎలక్ట్రికల్ పనులకు అవసరమైన టూల్‌కిట్, రబ్బర్ హ్యాండ్ గ్లోవ్స్, షూస్, జాకెట్లు ఉండగా వీటన్నింటిని పవన్ తన సొంత నిధులతో సమకూర్చారు. అనంతరం మాట్లాడుతూ ఏప్రిల్‌లో పిఠాపురం మండలం మల్లాం గ్రామంలో ఎలక్ట్రీషియన్‌గా పనిచేసే దళిత యువకుడు పల్లపు సురేష్ ఒకరి ఇంటిలో కరెంటు పనిచేస్తూ మరణించడం తనను తీవ్రంగా కలచివేసిందన్నారు. అతడి మరణంతో కుటుంబం పెద్ద దిక్కు కోల్పోయి నిరాధరమైందన్నారు. సురేష్ మరణం వెనుక ఉన్న కారణాలు పరిశీలిస్తే పేదరికం, విద్యుత్ పనులు చేసేటప్పుడు అతడి వద్ద రక్షణ పరికరాలు లేకపోవడంగా గుర్తించామని తెలిపారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకూడదనే లక్ష్యంతో తన సొంత నిధులతో ప్రవేటు ఎలక్ట్రీషియన్లందరికీ రక్షణ పరికరాల కిట్లు అందజేస్తున్నామని తెలిపారు. సురేష్ కుటుంబానికి ప్రధానమంత్రి సురక్షా బీమా యోజన పథకం ద్వారా రూ.2లక్షలు, చంద్రన్న బీమా ద్వారా రూ.2లక్షలు అందించే ఏర్పాటు చేశామని పవన్ చెప్పారు. నిరుద్యోగ యువత కోసం ప్రతి 3 నెలలకు ఒకసారి పిఠాపురం నియోజకవర్గంలో జాబ్‌మేళా నిర్వహించేలా ఏర్పాటు చేస్తున్నామని ప్రకటించారు. కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్, పంచాయతీరాజ్ కమిషనరు కృష్ణతేజ, పిఠాపురం కమిషనరు కనకారావు పాల్గొన్నారు.



మంగళగిరిలో ఎలక్ట్రీషియన్లకు సేఫ్టీ కిట్లు అందజేసిన డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్

పాపికొండలకు తరలివచ్చిన పర్యాటకులు

దేవీపట్నం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి పాపికొండల అందాలను తిలకించేందుకు ప్రకృతి ప్రేమికులు తరలివచ్చారు. దేవీపట్నం మండల పరిధిలో పోశమ్మగండి బోటు పాయింట్ నుంచి గోదావరి ముంపు పరీవాహక ప్రాంతాలైన పూడిపల్లి, తొయ్యేరు, దేవీపట్నం, అగ్రహారం, మూలపాడు, మడిపల్లి, మంటూరు, కచ్చులూరు, కె.గోందూరు, నడిపూడి తదితర గ్రామాల మీదుగా నాలుగు బోట్లలో 260మంది పాపికొండలకు వెళ్లారు. పేరంటాలపల్లిలో సందడి చేసి వెనుదిరిగారు. ముందుగా గండిపోశమ్మను దర్శించుకున్నారు. ఆలయం వద్ద భక్తులు పుణ్యస్నానాలు ఆచరించేందుకు గోదావరిలోకి వెళ్లకుండా రేవుల వద్ద పోలీసులు గస్తీ నిర్వహించారు. ప్రమాదాలు జరుగుతున్న దృష్ట్యా భక్తులు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.



పాపికొండలకు వెళ్తున్న పర్యాటక బోటు

లోవ దేవస్థానానికి రూ.6.60 లక్షల ఆదాయం

తుని రూరల్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో ప్రసిద్ధి పుణ్యక్షేత్రం తలుపులమ్మ లోవ దేవస్థానానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వివిధ విభాగాల ద్వారా ఆలయానికి రూ.6.60 లక్షల ఆదాయం సమకూరినట్టు ఈవో వి.విశ్వనాధ్‌రాజు తెలిపారు.



ప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

హైకోర్టు జడ్జి ప్రత్యేక పూజలు

సామర్లకోట, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): పంచారామ పుణ్యక్షేత్రమైన సామర్లకోట భీమేశ్వరాలయానికి చెన్నై హైకోర్టు జడ్జి ఎన్.మాల, కమిషనరు ఆఫ్ యూత్ సర్వీసెస్ (విజయవాడ) కె.శారద ఆదివారం విచ్చేశారు. వారికి ఈవో నీలకంఠం ఆధ్వర్యంలో వేదపండితులు సాదర స్వాగతం పలికారు. భీమేశ్వరస్వామికి అభిషేకాలు, బాలాత్రిపురసుందరి అమ్మవారికి విశేష కుంకుమార్చన జరిపారు. నంది మండపం వద్ద పండితులు వేదాశీర్వచనం ఇచ్చి ప్రసాదాలు, స్వామి, అమ్మవార్ల చిత్రపటాలు అందజేశారు.



వేదాశీర్వచనంతో ప్రసాదాలు అందజేస్తున్న దృశ్యం

షైనీ అవార్డులకు 19 మంది ఎంపిక

బిక్కవోలు, జూన్ 8(ఆంధ్రజ్యోతి): నియోజక వర్గంలోని అనపర్తి, బిక్కవోలు,రంగంపేట మండలాల్లో ఇటీవల పదో తరగతి పరీక్షల్లో 500 మార్కులు పైగా సాధించిన 19 మంది విద్యార్థులు షైనీ(ప్రతిభా) అవార్డులకు ఎంపికయ్యారు. అనపర్తి మండలం జీబీఆర్ హైస్కూల్ నుంచి ఎంఎన్ఎస్‌కేఆర్‌పీ లక్ష్మీనక్షత్ర, ఎ.సౌమ్యశ్రీ, టీఏఆర్ టాలెంట్ స్కూల్ నుంచి కె.శ్రీవైష్ణవి రెడ్డి, ఎ.రాజసూర్య, జడ్పీ బాలుర హైస్కూల్ నుంచి ఎస్.కోదండరామారెడ్డి, కుతుకులూరు జడ్పీ హైస్కూల్ నుంచి టి.యామిని, లక్ష్మీనరసాపురంలోని ఏపీఎస్‌డబ్ల్యుఆర్ బాలుర పాఠశాల నుంచి జె.మంజునాథస్వామి, నారాయణ స్కూల్ నుంచి డి.చంద్రరావు ఎంపికయ్యారని ఇన్‌చార్జి ఎంఈవో కె.శ్రీనివాసరావు తెలిపారు. బిక్కవోలు మండలంలో నేతాజి శ్రీవిద్యానికేతన్ నుంచి జి.కీర్తి, బి.కావ్యశ్రీ, జి.నవ్య, వై.దుర్గాగాయత్రి, కె.ఏంజిల్, ఎం.లక్ష్మీవిష్ణువర్ధన్ ఎంపికయ్యారని ఎంఈవో సీహెచ్‌వీవీ సత్యనారాయణ తెలిపారు. రంగంపేట మండలం వడిశలేరు జడ్పీ హైస్కూల్ నుంచి ఎ.లక్ష్మీప్రియాంక, పీహెచ్ ఎస్‌వీ వీరవెంకటకృష్ణ, ఈలకొలను జడ్పీ హైస్కూల్ నుంచి డి.అక్షప్రియ, చంద్రేడు జడ్పీ హైస్కూల్ నుంచి ఎం.అనూహ్య, రంగంపేట హైస్కూల్ నుంచి కె.శ్యామ్‌కుమార్ ఎంపికయ్యారని ఎంఈవో శ్రీనివాసరావు తెలిపారు. వీరందరూ సోమవారం రాజమహేంద్రవరంలోని శ్రీత్యాగరాజ నారాయణ దాస సేవా సమితిలో జరిగే కార్యక్రమంలో రూ.20 వేల నగదు, మెడల్, ప్రశంసాపత్రాలను అందుకోనున్నారు.

ఐదేళ్ల యాక్షన్ ప్లాన్ అమలుకు కృషి

గెయిల్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ప్రత్యేకాధికారి ప్రేమ్‌కుమార్


సమావేశంలో మాట్లాడుతున్న ప్రేమ్‌కుమార్

అనపర్తి, జూన్ 8(ఆంధ్రజ్యోతి): విజన్ స్వర్ణాంధ్ర-2047లో భాగంగా ఐదేళ్ల యాక్షన్ ప్లాన్ పక్కాగా అమలు చేసేందుకు అధికారులు కృషి చేయాలని గెయిల్ స్పెషల్ కలెక్టర్, నియోజకవర్గ ప్రత్యేకాధికారి రాజా రమేష్ ప్రేమ్‌కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి అధికారులతో యాక్షన్ ప్లాన్‌పై సమీక్ష నిర్వహించారు. ఐదేళ్ల ప్లాన్‌లో ఇంకా చేర్చాల్సి అంశాలపై చర్చించేందుకు ఈ సమావేశం ఏర్పాటు చేసినట్టు తెలిపారు.కార్యక్రమంలో ఎంపీడీవో ఎం.రామకృష్ణారెడ్డి, పెదపూడి డీఎంపీడీవో ఎంఎస్ఎన్ రెడ్డి, బిక్కవోలు,రంగంపేట ఎంపీడీవోలు శ్రీనివాసరావు, సాయిబాబా పాల్గొన్నారు.

బధిరుల సంక్షేమానికి కూటమి కట్టుబడి ఉంది

జిల్లా జనరల్ బాడీ సమావేశంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు


సమావేశంలో మాట్లాడుకుంటున్న బధిరులు

రాజమహేంద్రవరంసిటీ, జూన్8(ఆంధ్రజ్యోతి): బధిరుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు. ఆదివారం స్థానిక ఆనం కళాకేంద్రంలో జరిగిన జిల్లా స్థాయి బధిరుల సంక్షేమ సంఘం జిల్లా జనరల్ బాడీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. బదిరుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరిస్తుందని భరోసా ఇచ్చారు. అనంతరం బధిరుల సంక్షేమ సంఘం అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు వి.చంద్రశేఖర్ ఎన్నికల అధికారిగా, స్టేట్ ఎక్జిక్యూటివ్ మెంబర్ ఎన్.శాంతిబాబు రిటర్నింగ్ ఆఫీసర్‌గాను వ్యవహరించి ఎన్నికలు నిర్వహించారు. 200 మంది సభ్యులు ఈ ఎన్నికల్లో పాల్గొని నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అసోసియేషన్ ఆఫ్ ది డెఫ్ జిల్లా అధ్యక్షుడిగా ఈ.విశ్వనాథం, ఉపాధ్యక్షులుగా పి.జ్ఞానేశ్వర్, డి.సాయికుమార్, జనరల్ సెక్రటరీగా ఎ.విజయకుమార్, జాయింట్ సెక్రటరీగా ఎం.దేవేంద్రకుమార్, కోశాధికారిగా టి.ఫణి, మహిళా కార్యదర్శిగా ఈ.శాంతి, మరో నలుగురు కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. వీరి పదవీకాలం 2025-2028 వరకు ఉంటుందని అధ్యక్షుడు చంద్రశేఖర్ తెలిపారు.

రైల్వేస్టేషన్‌లో తనిఖీలు

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 8(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం ప్రధాన రైల్వేస్టేషన్‌లో ఆదివారం ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీఎఫ్, ఎల్‌పీ అండ్ ఈగల్ బృందాలు తనిఖీలు నిర్వహించాయి. నార్కోటిక్‌కు వ్యతిరేకంగా నిర్వహించిన డ్రైవ్‌లో బాగంగా ఆయా బృందాలకు సంబందించి సుమారు 50 మంది సిబ్బందితో ఐఆర్‌పీ శ్రీనివాసరెడ్డి, ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ బి.రాజు, టూటౌన్ సీఐ శివగణేష్, డీఎస్ఆర్‌పీ ఎం.జయరామ్ సంయుక్త తనిఖీలు నిర్వహించారు. అలాగే ట్రైన్ నెంబర్ 17240, ఎక్స్‌ప్రెస్ 11202లను కూడా తనిఖీ చేశారు.

లంక భూముల్లో 25 మోటార్ల రాగి వైర్లు చోరీ

సీతానగరం, జూన్ 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని రఘుదేవపురం, సీతానగరం గ్రామాల్లోని లంక భూముల్లో ఉన్న విద్యుత్ మోటార్ల రాగి వైర్లను శనివారం గుర్తుతెలియని వ్యక్తులు దొంగతనం చేసి పట్టుకుపోయారు. ఆదివారం సీతానగరం రైతులు చిటికినెడ్డి పోశియ్య, మట్ట శ్రీను, ఈలి శ్రీధర్ తదితరులు విలేకరులతో మాట్లాడుతూ శనివారం రాత్రి రైతుల పంట భూముల్లో ఉన్న 25 మోటార్లకు ఉన్న సుమారు 250 మీటర్లు పొడవున్న రాగివైరును దొంగిలించారని ఆవేదన వ్యక్తం చేసారు దీని ఖరీదు సుమారు రూ.2,50,000 ఉంటుందన్నారు. కాగా రాత్రుళ్ల కొందరు యువకులు లంక భూముల్లో మద్యం తాగి వెళుతున్నారని, వారే ఈ పనికి పాల్పడి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు. ఈ విషయమై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు.


దొంగలు మోటార్ వైర్ కట్ చేసిన దృశ్యం

ఒకే రాత్రి నాలుగు ఆలయాల్లో చోరీలు


కుతుకులూరు ఆంజనేయస్వామి ఆలయంలో వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీమ్

అనపర్తి, జూన్ 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుతుకులూరు, పులగుర్త గ్రామాల్లో శనివారం రాత్రి నాలుగు దేవాలయాల్లోని హుండీలను దుండగులు పగులగొట్టి కానుకలను దోచుకెళ్లారు. ఎస్‌ఐ శ్రీను నాయక్ వివరాల ప్రకారం.. శనివారం రాత్రి కుతుకులూరు ఆంజనేయస్వామి, సాయిబాబా, లక్ష్మీదేవి ఆలయాలతో పాటు, పులగుర్తలోని గంగాలమ్మ ఆలయంలో దొంగలు పడి హుండీలను పగులగొట్టి సొమ్ములను దోచుకెళ్లారు. హుండీల్లో సుమారు రూ.8 వేల వరకు నగదు ఉన్నట్టు తెలిసింది. దొంగతనాలు జరిగిన ఆలయాలను సీఐ సుమంత్ ఆధ్వర్యంలో పోలీసులు పరిశీలించారు. కాకినాడ నుంచి వచ్చిన క్లూస్ టీమ్ వేలుముద్రలు సేకరించింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

రాజమహేంద్రవరంలో ఎస్‌వీఎస్ టీవీఎస్ షోరూం

100 మందికి ఉద్యోగావకాశాలు.. షోరూం అధినేతలు దుద్దుపూడి శ్రీధర్, సాయి


షోరూంను ప్రారంభించి మొదటి సేల్ కీ అందజేస్తున్న ఎమ్మెల్యే గోరంట్ల

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 8(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం వీఎల్ పురం-మోరంపూడి రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన ఎస్‌వీఎస్ టీవీఎస్ షోరూం ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. ఆదివారం ఉదయం జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి హాజరై షోరూంను ప్రారంభించారు. అలాగే టీవీఎస్ స్కూటీ మొదటి సేల్‌ను ఎమ్మెల్యే, షోరూం మేనేజింగ్ డైరెక్టర్లు దుద్దుపూడి శ్రీధర్, సాయి, టీవీఎస్ జీఎం జోషీలతో కలిసి ప్రారంభించారు. వినియోగదారుల నమ్మకాన్ని పొంది వ్యాపార అభివృద్ధి జరగాలని గోరంట్ల అన్నారు. దుద్దుపూడి శ్రీధర్, సాయిలకు అభినందనలు తెలిపారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో శ్రీధర్ మాట్లాడుతూ గత 28 ఏళ్ల ఫైనాన్స్ రంగంలో ఉన్నామని, ఇప్పటి ఈ షోరూంలతో కలిసి రెండు షోరూమ్‌లు నగరంలో తమకు ఉన్నాయన్నారు. ఎస్‌వీఎస్ టీవీఎస్ షోరూం ద్వారా ప్రత్యక్షంగా పరోక్షంగా 100 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించామన్నారు. మంచి సర్వీస్‌ను మా ఖాతాదారులకు అందిస్తామన్నారు. జీఎం జోషి మాట్లాడుతూ దేశంలో టీవీఎస్ 1004 షోరూమ్‌లు కలిగి వుందన్నారు. రాష్ట్రంలో 46 మంది డీలర్ షిప్‌లు, 140 మంది సబ్ డీలర్లు కలిగి వుందన్నారు. దేశంలో అత్యంత నమ్మికమైన ద్విచక్ర వాహనాల తయారీ సంస్థగా టీవీఎస్ పేరుగాంచిందన్నారు. అనంతరం జోషిని శ్రీధర్ సత్కరించారు. కార్యక్రమంలో నగర ప్రముఖులు కుందుల బలరామకృష్ణ, కొల్లేపల్లి శేషయ్య, నిమ్మలపూడి గోవింద్, కొండేటి భీమారావు, మస్తాన్ చౌదరి, నూరంపూడి శ్రీహరి, మజ్జి పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

కోటసత్తెమ్మకు పూజలు

నిడదవోలు, జూన్ 8(ఆంధ్రజ్యోతి): తిమ్మరాజుపాలెంలోని శ్రీకోటసత్తెమ్మ దేవస్థానంలో ఆదివారం విశేష పూజలు జరిపారు. ఈ సందర్భంగా సుప్రభాత సేవ, ధూపహారతి, నిత్యార్చన, లలితా పారాయణం, సహస్రనామ కుంకుమ పూజలు చేశారు. ప్రత్యేక పూల అలంకరణలో ఉన్న అమ్మవారిని భక్తులు దర్శించుకుని తీర్థప్రసా దాలు స్వీకరించారు.

ఉన్నా ఉపయోగమేదీ!

అధ్వానంగా సూరంపాలెం ప్రాజెక్టు

- నేటికీ పూర్తికాని 12వ కుడి కాలువ పనులు
- ఎక్కడికక్కడ పూడిక
- సాగునీరు అందక ఇక్కట్లు
- హెడ్ వర్క్స్ పనులకు ముసురుమిల్లి ఎదురుచూపులు


నిర్వహణకు నోచుకోని సూరంపాలెం కాలువ


పిల్ల కాలువల దుస్థితి

గోకవరం, జూన్ 8(ఆంధ్రజ్యోతి): గోకవరం మండలంలో సుమారు ఆరు వేల హెక్టార్లలో అధికంగా వరి పంట సాగు జరుగుతోంది. ప్రాజెక్టుల ద్వారా వచ్చే నీరే ఈ పంటలకు ఎక్కువ ఆధారం. అల్లూరి సీతారామ రాజు జిల్లా రంపచోడవరం మండలంలో ఉన్న ముసురుమిల్లి ప్రాజెక్టు ద్వారా సుమారు 10 వేల ఎకరాలకు, గంగవరం మండలంలో ఉన్న సూరంపాలెం ప్రాజెక్టు నుంచి సుమారు 5వేల ఎకరాలకు పైగా సాగునీరు అందాల్సి ఉంది. వీటితోపాటు పుష్కర కాలువ నుంచి మరో 3000 ఎకరాలకు సాగునీరు పంట పొలాలకు వచ్చి చేరుతుంది. అయితే వీటిలో సూరంపాలెం ప్రధాన కాలువ పరిస్థితి చాలా అధ్వానంగా ఉంది. నేటికీ 12వ కుడి కాలువ పనులు పూర్తికాకపోవడంతో ఆయకట్టుకు సాగునీరు అందడంలేదు. కాలువలో ఎక్కడికక్కడ పూడిక పేరుకుపోయి కనీసం నీరు పారని పరిస్థితిలో కొట్టుమిట్టాడుతోంది. ఈ ప్రాజెక్టు ద్వారా గంగవరం, గోకవరం, కోరుకొండ మండలాలకు చెందిన పొలాలకు నీరు చేరాల్సి ఉంది. పూడిక నిండి పోవడం వల్ల కాలువలో వదిలిన నీరు చివరి వరకు చేరడం లేదు.ఖరీఫ్ ప్రారంభంలో వర్షాధారంతో రైతులు నెట్టికొచ్చినప్పటికీ సాగు తుది దశకు చేరుకునే సరికి రైతులకు సాగునీరు కష్టాలు తప్పడం లేదు. గత ఏడాది ఖరీఫ్‌లోను ఇదే విధమైన పరిస్థితులు తలెత్తి రైతులు తీవ్రంగా నష్టపోయారు. కాలువ పూడిక పనులు చేపట్టి సాగు నీరు అందించాలని ఎప్పటి నుంచో రైతులు వేడుకుంటున్నా ఆ దిశగా పనులు ముందుకు సాగడం లేదు. ఇటీవల ప్రాజెక్టు పరిస్థితిని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన వెంటనే సానుకూలంగా స్పందించి సాగునీరు అందేలా చర్యలు తీసుకుంటానని రైతులకు భరోసా ఇచ్చారు. ఇంకో పక్క ముసురుమిల్లి ప్రాజెక్టు హెడ్ వర్క్స్ పనులు పూర్తికాక గోకవరం మండలంలోని పలు గ్రామాల రైతులు ఇబ్బందులు చవిచూస్తున్నారు. 2004 సంవత్సరంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి నిర్మాణ పనులకు శంకు స్థాపన చేయగా 2006లో పనులు ప్రారంభించారు. ఇప్పటికి 20 సంవత్సరాలు గడిచినప్పటికీ హెడ్ వర్క్స్ పనులు కొలిక్కి రాకపోవడంతో ముసురుమిల్లి ప్రాజెక్టు ఇంకనూ రైతులకు వినియోగంలోకి రాలేదు. సుమారు రూ.182 కోట్లతో చేపట్టిన ఈ ప్రాజెక్టు పనులకు మరో రూ.9 కోట్లు వెచ్చిస్తే నిర్మాణపు పనులు తుది దశకు చేరుకుంటాయని ఇక్కడి రైతాంగం అంటోంది. వీటితోపాటు మండలంలోని కొన్ని చోట్ల కాలువ గట్లు, పిల్ల కాలువలను పటిష్టం చేయాలని రైతులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

'పోలవరం ప్రాజెక్టు నాణ్యతలో రాజీ పడొద్దు'

రాజమహేంద్రవరం, జూన్ 8(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో నాణ్యత విషయంలో రాజీ పడకుండా ప్యానల్ ఆఫ్ ఎక్స్‌పెర్ట్ కమిటీలు, ప్రాజెక్టుకు సంబంధించిన ఇతర అథార్టీలను పర్యవేక్షిస్తూ ప్రాజెక్టును సమర్థవంతంగా నిర్మించాలని మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్ డిమాండ్ చేశారు. రాజమహేంద్రవరంలోని మార్గాని ఎస్టేట్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంక్రీట్ డయాఫ్రంవాల్ నిర్మాణం నిబంధనల ప్రకారం జరగడం లేదని ప్యానల్ ఆఫ్ ఎక్స్‌పర్ట్ కమిటీకి చెందిన నలుగురు సభ్యులు ఈనెల 4న నివేదిక ఇచ్చారని అన్నారు. ఇప్పటివరకూ 52 ప్యానల్స్ మాత్రమే నిర్మించారని, ఇక వరదలు వస్తే పరిస్థితి ఏంటని మాజీ ఎంపీ ప్రశ్నించారు.

సర్పంచ్ చంటికి గోరంట్ల అభినందనలు

కడియం, జూన్ 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ జీవ వైవిధ్య పురస్కారం-2025 అవార్డు అందుకున్న మాధవరాయుడు పాలెం సర్పంచ్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి అన్నందేవుల చంటిని ఆయన ఇంటి వద్ద ఆదివారం ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అభినందించారు. ఈ సదర్భంగా చంటికి చిత్రపటాన్ని, మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. రానున్న రోజుల్లో నర్సరీ, ప్రకృతి వ్యవసాయ రంగాలను మరింత బలోపేతం చేసి రైతులకు ఆదర్శంగా నిలవాలని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వెలుగుబంటి వెంకట సత్యప్రసాద్, అన్నందేవుల రాముడు, టీడీపీ మండలాధ్యక్షుడు వెలుగుబంటి నాని, అడ్వకేట్ రమేష్, పడాల బాబి, గుబ్బల నాగేష్, పెంకే నాగేష్, బొల్లా ధనుంజయ్ పాల్గొన్నారు.

పెల్లుబికిన ఆగ్రహం

అమరావతిపై వ్యాఖ్యలకు నిరసన
పలుచోట్ల తెలుగు మహిళల ధర్నా
పోలీసులకు ఫిర్యాదులు



రాజమహేంద్రవరంలో డీఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న తెలుగు మహిళలు

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 7(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిపై అసభ్య పదజాలంతో సాక్షి న్యూస్ చానల్‌లో జరిగిన ఓ డిబేట్‌లో వ్యాఖ్యలు చేసిన కేఎస్ఆర్, కృష్ణంరాజులపై ఆగ్రహం పెల్లుబికింది. దీంతో ఆదివారం పలుచోట్ల తెలుగు మహిళలు నిరసన వ్యక్తం చేశారు. అసభ్య వ్యాఖ్యలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదులు చేశారు. రాజమహేంద్రవరంలో తెలుగు మహిళ నగర అధ్యక్షురాలు కోసూరి చండీప్రియ, పార్లమెంట్ జిల్లా అధ్యక్షురాలు మాలే విజయలక్ష్మి ఆధ్వర్యంలో స్థానిక సెంట్రల్ జోన్ డీఎస్పీ కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శన చేపట్టారు. డీఎస్పీ రమేష్‌బాబుకు ఫిర్యాదు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలపై వ్యాఖ్యలు చేసిన కొమ్మినేని శ్రీనివాసరావు, జర్నలిస్ట్ కృష్ణంరాజు, సాక్షి యాజమాన్యంపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అమరావతిని వేశ్యల రాజధాని అని, ఎయిడ్స్ రోగుల కేంద్రమని అనడం సబబు కాదన్నారు. అమరావతిని కూటమి ప్రభుత్వం భావించి ప్రపంచ స్థాయిలో అభివృద్ధికి సీఎం చంద్రబాబు శ్రీకారం చుట్టారని చెప్పారు. మూడు రాజధానుల పేరుతో అమరావతి మహిళలను జగన్ అప్పట్లో రోడ్డెక్కించారని తమకు జరిగిన అన్యాయంపై ప్రపంచానికి తెలియజెప్పే ప్రయత్నంగా పాదయాత్ర చేస్తే అడుగడునా అడ్డుకున్నారన్నారు. ఇప్పుడు అమరావతి మహిళలను వేశ్యలుగా మాట్లాడటం జర్నలిస్ట్ వృత్తికే కళంకమన్నారు. తక్షణమే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసారు. అనంతరం వారంతా రాజానగరం సాక్షి యూనిట్ కార్యాలయం వద్దకు చేరుకుని ధర్నాచేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పార్లమెంట్ ఉపాధ్యక్షుడు మజ్జి రాంబాబు, తెలుగు మహిళలు తురకల నిర్మల, మీసాల నాగమణి, బోను ఈశ్వరి, గొర్రెల రమణి, దొంగ నాగమణి, నాగలక్ష్మి, శ్రీలత, బూరా కల్పన, తుల్లి పద్మ, మోతానాగలక్ష్మి, కనకదుర్గ, నాయకులు చింత జోగి నాయుడు, శనపతి సత్తిబాబు, వీరా రాము, కిల్లాపర్తి నాగభూణం, మహిళలు పాల్గొన్నారు.

రాజానగరం: మహిళా లోకాన్నే కించపర్చే విధంగా అమరావతిపై సాక్షి టీవీ ఛానల్ డిబేట్‌లో చేసిన అసభ్యకర వ్యాఖ్యలను నిరసిస్తూ టీడీపీ రాజమహేంద్రవరం పార్లమెంట్ అధ్యక్షురాలు మాలే విజయలక్ష్మి, ఎస్సీ సెల్ జిల్లా సెక్రటరీ ఖండవిల్లి లక్ష్మి ఆధ్వర్యంలో రాజానగరం సమీపంలోని సాక్షి పత్రిక ముద్రణ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ మాజీ సీఎం జగన్ మతి భ్రమించి కొంతమంది వీధి కుక్కల్ని ఉసుగొలిపి సీఎం నారా చంద్రబాబునాయుడుపైన, అమరావతిపైన దుష్ప్రచారాలు చేస్తున్నారన్నారు. సాక్షి పత్రిక ఎండీ భారతి, మాజీ సీఎం జగన్ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఐ ఎస్.ప్రసన్న వీరయ్యగౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి నూనె వెంకన్న, నీలపాల అరవరాజు, వంక మల్లిబాబు, చిట్టిప్రోలు పద్దరాజు, దాసరి శ్రీను, సంగిత సత్తి బాబు, మహిళా అధ్యక్షురాలు మజ్జి పద్మ మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అనపర్తి: అనపర్తిలో నియోజకవర్గ తెలుగు మహిళల ఆధ్వర్యంలో సీఐ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఎస్‌ఐ శ్రీనునాయక్‌కు ఫిర్యాదు అందజేశారు. తెలుగు నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు జుత్తుగ సూర్యకుమారి మాట్లాడుతూ సాక్షి చానల్‌లో జరిగిన డిబేట్‌లో అమరావతి మహిళలపై సభ్య సమాజం తలదించుకునే విధంగా వ్యాఖ్యలు చేసిన జర్నలిస్టు కృష్ణంరాజు, కొమ్మినేని, సాక్షి యాజమాన్యంపై కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలుగు మహిళలు కర్రి శేషారత్నం, బేరా వేణమ్మ, సుభాషిణి, సిరసపల్లి లక్ష్మి, త్రివేణి, బీజేపీ మహిళా నేతలు, జనసేన వీర మహిళలు పాల్గొన్నారు.


అనపర్తిలో ఎస్ఐ శ్రీనునాయక్‌కు ఫిర్యాదు అందజేస్తున్న దృశ్యం

కఠినంగా శిక్షించాలి

తెలుగు మహిళా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మజ్జి పద్మావతి

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 8(ఆంధ్రజ్యోతి): అమరావతి మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలుగు మహిళా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మజ్జి పద్మావతి డిమాండ్ చేశారు. ఆదివారం రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రాజధాని అమరావతిపై విషం చిమ్ముతూనే ఉన్నారని, ఇప్పుడు తాజాగా కేఎస్ఆర్, జర్నలిస్ట్ కృష్ణంరాజు అమరావతి మహిళలను కించపరిచారని, పంచారామ క్షేత్రాల్లో ఒకటైన అమరావతిని తూలనాడడం హిందువుల మనోభావాలను దెబ్బ తీయడమేనన్నారు. మహిళల పట్ల కూటమి ప్రభుత్వం చాలా గౌరవంగా ఉంటుందన్నారు. అందుకే వైఎస్ భారతీరెడ్డిపై వ్యాఖ్యలు చేసిన సొంత పార్టీ కార్యకర్తపై తమ నాయకుడు చంద్రబాబు చర్యలు తీసుకున్నారన్నారు. మరి అమరావతి మహిళలను కించపరిస్తే భారతీరెడ్డి ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. వైసీపీ ప్రభుత్వంలో అమరావతి రైతులకు అన్యాయం చేశారని అన్నారు. అమరావతిని తమ నాయకుడు చంద్రబాబు ప్రపంచ స్థాయి రాజధానిగా అభివృద్ధి చేస్తుంటే చూసి తట్టుకోలేక బురద జల్లుతున్నారన్నారు. సమావేశంలో జనసేన జిల్లా నాయకురాలు బోడపాటి రాజేశ్వరి, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ మద్దా మణి తదితరులు పాల్గొన్నారు.

యోగాంధ్రతో ఆరోగ్యాంధ్ర సాధించాలి : జేసీ


అవగాహన సదస్సులో పాల్గొన్న జేసీ చిన్నరాముడు

రాజమహేంద్రవరం కల్చరల్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): యోగాంధ్ర కార్యక్రమంలో కుటుంబ సమేతంగా అందరూ పాల్గొని ఆరోగ్య ఆంధ్ర సాధించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్న రాముడు అన్నారు. స్థానిక వెంకటేశ్వరనగర్‌లోని జవహర్ వాకర్స్ క్లబ్ ఆధ్వ ర్యంలో ఆదివారం సహజ యోగ ప్రదాత నిర్మలాదేవి ప్రవేశపెట్టిన సహజ యోగా ధ్యాన పద్ధతులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జేసీ అధ్యక్షత వహించి మాట్లాడారు.

ధవళేశ్వరం: యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక రథం వీధి గడియారపు స్తంభం సెంటర్ వద్ద జనసేన నాయకుడు యడ్ల మహేష్ ఆధ్వర్యంలో యోగా శిక్షకుడు తలాటం సూర్య ప్రకాశరావు,ఒంటెద్దు స్వామి పర్యవేక్షణలో యోగా శిక్షణ నిర్వహించారు. స్థానిక యువత, జనసైనికులు పాల్గొని యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా మహేష్ మారుతున్న జీవన విధానంలో సంపూర్ణ ఆరోగ్యం కోసం ప్రతిరోజు యోగా చేయాలన్నారు.

రాజమహేంద్రవరం అర్బన్: శారీరక, మానసిక ఆధ్యాత్మికతకు యోగా గొప్ప సాధన ప్రక్రియ అని జిల్లా రెవెన్యూ అధికారి టి.సీతారామమూర్తి అన్నారు. ఆదివారం యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా 14వ రోజున సీనియర్ సిటిజన్స్‌తో యోగా సాధన ప్రక్రియ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధాప్యంలో నిత్యం యోగా సాధన వల్ల మానసిక ఆందోళన, ఒత్తిడిలకు దూరంగా ఉండవచ్చని అన్నారు. వయస్సు రీత్యా వచ్చే కొన్ని రుగ్మతలకు దూరంగా ఉండవచ్చని, మందులతో నయం కాని కొన్ని శారీరక జబ్బులు యోగా సాధనతో పరిష్కారం లభిస్తాయని పేర్కొన్నారు. యోగా గురువు శివ యోగా సాధనకు సంబంధించిన వివరాలు తెలియజేశారు. ఈ సందర్భంగా బ్రహ్మకుమారి సిస్టర్స్ జ్ఞానం యోగాభ్యాసనపై వివరించారు. కార్యక్రమంలో ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ టి.తిలక్‌కుమార్, ఇతర అధికారులు, వయోవృద్ధులు, తదితరులు పాల్గొన్నారు.


ధవళేశ్వరంలో యోగాసనాలు వేస్తున్న స్థానిక యువత, నాయకులు


ఆర్ట్స్ కాలేజీ వద్ద యోగాసనాలు వేస్తున్న సీనియర్ సిటిజన్స్

కృష్ణంరాజు, కొమ్మినేనిలను కఠినంగా శిక్షించాలి: టీకే

రాజమహేంద్రవరం సిటీ, జూన్8(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి మహిళలపై అసభ్యకరంగా అనుచిత వ్యాఖ్యలు చేసిన కృష్ణంరాజు, కొమ్మినేని శ్రీనివాసరావులపై కఠిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం రాజమహేంద్రవరంలో ఓ ప్రకటన విడుదల చేశారు. అటువంటి చర్చను సాక్షి ఛానల్‌లో నడపడం దురదృష్టకరమని అన్నారు. కన్నతల్లిని, చెల్లిని తరిమేసిన జగన్‌కు, ఆ పార్టీ నాయకులకు మహిళలను గౌరవించడం తెలియదని విమర్శించారు. ఛనల్‌లో కూడా మహిళలను అగౌరవ పరచడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానన్నారు.

సినిమా గైడ్

(రాజమహేంద్రవరం)

శ్యామల	: థగ్ లైఫ్
సూర్యమినీ	: హౌస్‌ఫుల్ 5ఎ, 5బి
సూర్యప్యాలస్	: థగ్ లైఫ్
స్వామి	: శ్రీశ్రీశ్రీ రాజా వారు
శివజ్యోతి	: బద్మాషులు, ధీ
అనుశ్రీ(సాయికృష్ణ)	: గ్యాంబ్లర్స్
రాజా	: భైరవం
ఊర్వశి	: థగ్ లైఫ్
రంభ	: ఫైనల్ డెస్టినేషన్
మేనక	: పాడేరు 12వ మైలు
అప్సర	: సింగిల్
కుమారి	: ----
అశోక	: భైరవం
వీఎస్ మహాల్(నామవరం)	: థగ్ లైఫ్
మురళీకృష్ణ(ధవళేశ్వరం)	: థగ్ లైఫ్
వెంకటసూర్య(కడియం)	: థగ్ లైఫ్
సత్యగౌరి (అనపర్తి)	: థగ్ లైఫ్
సూర్యశ్రీ (అనపర్తి)	: భైరవం
ఫార్ట్యూన్ సినిమాస్(రాజానగరం)	: థగ్ లైఫ్
రామకృష్ణ(కోరుకొండ)	: ఏస్
గీతాసినిమాస్ (సీతానగరం)	: ఏస్
శ్రీనివాస (గోకవరం)	: థగ్ లైఫ్
టీడీ సినీ మ్యాక్స్ (గోకవరం)	: భైరవం
లలితామహాల్(రంపచోడవరం)	: థగ్ లైఫ్
నవయుగ(చింతూరు)	: ----

రాజమహేంద్రవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 42.0 (ఆదివారం)
కనిష్ఠం : 28.0

విహారం..విషాదం 8
సీలేరులో అభిలాష్ మృతదేహం లభ్యం

ఏపీఈఏపీ సెట్‌లో 8,9 ర్యాంకులు మనవే

- తూర్పునకు ర్యాంకుల పంట
- 8,260 మందికి అర్హత
- ఉమ్మడి జిల్లా నుంచి నలుగురు

రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : ఏపీ ఈఏపీసెట్ - 2025లో తూర్పుగోదావరి జిల్లాకు చెందిన 8,260 మంది విద్యార్థులు క్వాలిఫై అయ్యారు. ఈ మేరకు కాకినాడ జేఎన్‌టీయూకే అధికారులు ఆదివారం ఫలితాలను విడుదల చేశారు. ఇంజనీరింగ్ స్ట్రీమ్‌లో 6,011 మంది, అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ స్ట్రీమ్‌లో 2,249 మంది అర్హత సాధించారు. అర్హత సాధించిన వారిలో ఇంజనీరింగ్ 3,390 మంది బాలురు, 2621 మంది బాలికలు ఉండగా, అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ స్ట్రీమ్‌లో 545 మంది బాలురు, 1704 మంది బాలికలు ఉన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం అర్బన్‌కు చెందిన దర్భా కార్తీక్ రామ్ కిరీటి(హాల్ టిక్కెట్ నెం.951262010302) అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ స్ట్రీమ్‌లో రాష్ట్రస్థాయిలో 8వ ర్యాంకు సాధించాడు. చాగల్లుకు చెందిన కొడవటి మోహిత్ శ్రీరామ్ 9వ ర్యాంకు సాధించాడు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం చొప్పెల్లకు చెందిన డేగల అకిరానంద వినయ్‌మల్లేష్ కుమార్ రాష్ట్రస్థాయిలో 3వ ర్యాంకు సాధించాడు. కాకినాడ జిల్లా పెద్దాపురంనకు చెందిన ఎస్.శ్రీసాయి గోవర్దన్ 6వ ర్యాంకు సాధించాడు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన నలుగురు విద్యార్థులు తొలి పది ర్యాంకుల్లో ఉండడం విశేషం.

భవిష్యత్తులో ఉన్నతస్థాయికి చేరుకోవాలి : మంత్రి దుర్గేష్

ఆంధ్రప్రదేశ్ ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ (ఏపీ ఈఏపీసెట్ - 2025)ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించిన రాష్ట్రంలోని విద్యార్థినీ విద్యార్థులకు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అభినందనలు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.భవిష్యత్తులో ఉన్నతస్థాయికి చేరుకోవాలన్నారు.

ఎంబీబీఎస్ చదవాలనేది నా లక్ష్యం



చాగల్లు : కష్టానికి తగిన ప్రతిఫలం దక్కింది. మాది చాగల్లు.. వ్యవసాయ కుటుంబం. తల్లిదండ్రులు సత్యనారాయణ, నవీన.నన్ను చదివించడానికి ఎంత గానో కష్టపడుతున్నారు. నీట్ కూడ రాశా.. ర్యాంకు సాధించి ఎంబీబీఎస్ చదువుతా.

- కొడవటి మోహిత్ శ్రీరామ్, 9వ ర్యాంకు, చాగల్లు

అమ్మానాన్నలా డాక్టర్‌ను అవుతా..



కొవ్వూరు : మాది కొవ్వూరు.. ఏపీఈఏపీసెట్‌లో 81వ ర్యాంకు సాధించా. మా అమ్మానాన్న రణధీర్‌రెడ్డి, మధులత ఇరువురు వైద్యులు. ఎంబీబీఎస్‌తో పాటు స్పెషల్ కోర్సు చేయాలన్నది లక్ష్యం. నీట్ రాశా తప్పనిసరిగా ర్యాంక్ సాధిస్తా..

-మాదిరెడ్డి వైష్ణవి,81వ ర్యాంకు, కొవ్వూరు



రాజధానిపై మాటలు.. మంటలు

రాజధాని అమరావతి, మహిళలపై అసభ్యకరంగా ప్రసారాలు చేసిన సాక్షి మీడియాపై ఆదివారం ఆగ్రహం పెల్లుబికింది.. మాటలు మంటలు చెలరేగాయి.. ఈ మేరకు అమరావతి దళిత జేఏసీ నాయకులు కొవ్వూరులో ఆదివారం ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్‌ను కలిసి వెంటనే చర్యలు తీసుకోవాలని విన్నవించారు. - 8లో



సీనరేజీ.. మింగేశారు!

రూ.196.17 కోట్ల సీనరేజి నిధులకు వైసీపీ ఎగనామం

- ఉమ్మడి జిల్లాలో ఇదీ లెక్క
- గత ఐదేళ్లలో పూర్తిగా వసూళ్లు
- స్థానిక సంస్థలకు ఎగవేత
- ఆర్థిక సంస్థల నిధులూ ఇంతే
- పంచాయతీరాజ్‌కు తీవ్ర అవస్థ
- పవన్ ఆదేశాలతో గుట్టురట్టు
- లెక్క తేల్చిన అధికారులు
- నివేదిక అందజేత

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇసుక కుంభ కోణం అంతా ఇంతా కాదు. అస్మదీయ కంపెనీలను అడ్డం పెట్టుకుని అప్పటి ప్రభుత్వ పెద్ద లు వేల కోట్లు దోచేశారు. ఐదేళ్ల పాటు ఇసుక దందాతో పెద్ద ఆర్థిక సామ్రాజ్యాన్నే నిర్మించుకు న్నారు.ఇసుక తవ్వకాల ద్వారా సొంత ఆదాయం పెంచుకున్న నాటి ప్రభుత్వ పెద్దలు సీనరేజీ సొమ్మును సైతం దారి మళ్లించేశారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో రీచ్‌ల పరిధిలో పం చాయతీలు, మం డల పరిషత్‌లు, జిల్లా పరి షత్‌కు ఈ డబ్బులను పంచాల్సి ఉంది.అయితే అదేదీ కాదని ఏకంగా దారి మళ్లించేశారు. ఐదేళ్ల పాటు రూ.196.17 కోట్లకు పంగ నామాలు పెట్టారు.అధికారికంగా ఇసుక తవ్వకం కంపెనీల నుంచి డబ్బులు వసూలు చేసినా వాటిని పం చాయతీలు,మండలపరిషత్, జడ్పీ ఖాతాలకు జమ చేయ లేదు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా లో వైసీపీ హయాంలో ఇసుక సీనరేజీ నిధులను ఎంత మేరకు ఎగ్గొట్టారనే దానిపై నివేదిక తయారు చేయాలని డిప్యూటీ సీఎం పవన్ ఆదేశించిన నేపథ్యంలో అధికారులు ఇటీవల గత ప్రభుత్వ నిర్వాకాన్ని బట్టబయలు చేశారు.

అంతా అడ్డగోలే..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో గోదావరి ఇసుకకు భారీ డిమాండ్ ఉంటుంది. పక్కనే ఉన్న విశాఖ నుంచి విజయవాడ వరకు అనేక నిర్మాణాలకు గోదావరి ఇసుకనే వాడతారు.గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో దాదాపు 23 వరకు రీచ్‌ల్లో ఇసుక తవ్వకాలు జరిగాయి. అత్యధికంగా కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల పరిధి లోని రీచ్‌ల్లో తవ్వకాలు ఐదేళ్ల పాటు నిరాట ంకంగా నడిచాయి. లక్షలాది టన్నుల ఇసుకను తరలించేశారు. అధికారిక, అనధికారిక రీచ్‌ల నుంచి కోట్ల విలువైన ఇసుకను తవ్వి తర లించేశారు.అధికారికంగా అనుమతించిన రీచ్‌ల్లో దాదాపుగా ఇసుకను జేపీ గ్రూపు భారీ స్థాయిలో తవ్వింది.ఇలా తవ్వినందుకు ఇసుక సీనరేజీని సంబంధిత పంచాయతీలు, మండల పరిషత్‌లు, జిల్లా పరిషత్‌కు చెల్లించే నిమిత్తం ఈ కంపెనీ రాష్ట్ర ప్రభుత్వానికి చెల్లించాలి. ఆ సొమ్మును ప్రభుత్వం ఆయా పంచాయతీరాజ్ వ్యవస్థల ఖాతాలకు జమ చేయాలి. కానీ వైసీపీ తన ఐదేళ్ల పాలనలో ఇసుక ద్వారా ఖజానాకు వేల కోట్ల ఆదాయం సమకూరినా ఉమ్మడి జిల్లాలో స్థానిక సంస్థలకు నిధులు మాత్రం ఇవ్వలేదు. ఇసుక తవ్వే కంపెనీలు, సంస్థల నుంచి అధికారికంగా ఐదేళ్ల సీనరేజీ వసూలు చేసినా వాటిని దారి మళ్లించేసింది. స్థానిక సంస్థలకు పంగ నామాలు పెట్టింది. దీంతో ఏ అవసరానికీ పంచాయతీలకు డబ్బుల్లేక ఈసురోమనాల్సిన పరిస్థితి తలెత్తింది. ఇదే కాదు 14,15 ఆర్థిక సంఘం నిధులు సైతం పంచాయతీలకు ఇవ్వ కుండా మింగేసింది. చివరకు విద్యుత్ బకాయిల పేరుతో గుంజేసింది. పంచాయతీలను ఐదేళ్ల పాటు జగన్ సర్కారు నిర్వీర్యం చేసింది.



పవన్ ఆదేశాలతో గుట్టురట్టు..

గతేడాది డిప్యూటీ సీఎం పవన్ పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత కాకినాడలో అధికారులతో సమీక్షించారు. గడచిన ఐదేళ్లలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో వైసీపీ ప్రభుత్వం సాగించిన అరాచకాలపై అధికారులతో మాట్లాడారు.గత వైసీపీ ప్రభుత్వం పంచాయతీరాజ్‌శాఖ పరిధిలోకి వచ్చే సీనరేజీ ఎంత మేర దారిమళ్లించేసిందో లెక్కలు తీయాలని ఆదేశించారు.అమరావతిలో అధికారులు కొన్ని నెలల పాటు ఫైళ్లు తిర గేసి లెక్కలు సిద్ధం చేశారు. దీని ప్రకారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఐదేళ్లలో గత జగన్ సర్కారు రూ.196.17 కోట్లు స్థానిక సంస్థలకు ఇవ్వకుండా పంగనామాలు పెట్టినట్లు లెక్క తేల్చారు.ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 2019-2021లో రూ.15.37 కోట్లు, 2021-2022లో రూ.89.90 కోట్లు, 2022-2023లో రూ.41.50 కోట్లు,2023-2024లో రూ.36.90 కోట్లు, 2024-2025లో రూ.12.50 కోట్లు చొప్పున సీనరేజీని ప్రభుత్వం వసూలు చేసిందని నిగ్గు తేల్చారు. వీటిని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పంచాయతీలు, మండల పరిషత్‌లు, జిల్లా పరిషత్‌కు ఇవ్వలేదని నివేదికలో విశ్లేషించారు.

మీకు ఆరోగ్యం ఇస్తున్నాం.. మా సంగతో!

మునిసిపల్, కార్పొరేషన్ వాహన డ్రైవర్లకు ఆరోగ్య భద్రత కరువు



- ఈఎస్‌ఐ అమలు కాక ఇక్కట్లు
- ఆరోగ్యశ్రీకి దూరందూరం
- పీఎఫ్‌కు కట్..కట
- ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల వెతలు

కొవ్వూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : చెత్తను చూస్తే దగ్గరికే వెళ్లరు..ముక్కున ఖర్చీఫ్ పెట్టుకుని దూరంగా వెళ్లిపోతారు..ఎందుకంటే ఏ రోగం తమకు అంటుకుటుందోనని భయం.. అటువంటిది ఆ చెత్తను తరలించి.. వీధులను శుభ్రంగా ఉంచే వాహనడ్రైవర్లకు మాత్రం ఆరో గ్య భద్రత కరువైంది. దీంతో అనారోగ్యం పాలవుతున్నా పట్టించుకునేవారే కరవవుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా మునిసిపాలిటీలు, కార్పొరేషన్లలో సుమారు 10 వేల మంది డ్రైవర్లు అవుట్ సోర్సింగ్ విభాగంలో పనిచేస్తున్నారు. తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా 42 మంది ఉన్నారు. వీరందరికి 2024 జనవరిలో వైసీపీ ప్రభుత్వం రూ.24,500 చొప్పున వేతనాలు పెంచింది. అయితే ఈఎస్‌ఐ పరిధి రూ.21 వేలు కావడంతో ఆగిపోయింది. ఈఎస్‌ఐ లేకపోవడం, ప్రభుత్వం హెల్త్ అలవెన్స్‌లు చెల్లించడంలేదు.. అంతేకాకుండా ఆరోగ్య శ్రీ అమలు కావడంలేదు.దీంతో డ్రైవర్లు, వారి కుటుం బాలు ఆరోగ్య భద్రతపై ఆందోళన చెందుతున్నారు.ఏదైనా అనారోగ్యానికి గురైతే ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తుందని వాపోతున్నారు.మరో పక్క పీఎఫ్ పాత వేతనం రూ.15 వేలకు మాత్రమే 12 శాతం చొప్పున రూ.1800లు, ప్రొఫెషనల్ టాక్స్ రూ.200లు కలిపి రికవరీ చేస్తూ ఒక్కొక్క ఉద్యోగి నుంచి రూ.2వేలు చొప్పున కట్ చేస్తున్నారు. రూ.24,500ల పూర్తి వేతనంపై పీఎఫ్ రికవరి చేయాలని డిమాండ్ చేస్తున్నారు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణించడంతో కనీస వేతనాలు అమలు కాకపోగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందడం లేదు. పెరుగుతున్న ధరలతో కుటుంబపోషణ కష్టసాధ్యంగా మారిందని కన్నీటి పర్యంతమవుతున్నారు.కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలను వర్తింపచేయాలని కోరుతున్నారు. గత 18 నెలలుగా యూనియన్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని అధికారులను కోరినా ఫలితం లేదని వాపోతున్నారు.కూటమి ప్రభుత్వంలో న్యాయం చేయాలని ఎమ్మెల్యేలను వేడుకుంటున్నారు.

ఈఎస్‌ఐ సౌకర్యం కల్పించాలి



మునిసిపాలిటీల్లో అవుట్‌సోర్సింగ్ విభాగంలో పనిచేస్తున్న డ్రైవర్లకు పూర్తిస్థాయిలో పీఎఫ్,ఈఎస్‌ఐ సౌకర్యం కల్పించాలి. కేంద్ర ప్రభుత్వ హెల్త్ అలవెన్సు రూ.6 వేలు అందించాలి. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులందరికి ప్రభుత్వ పథకాలు వర్తింపచేయాలి.

- రాజాన అప్పారావు, సంఘ కొవ్వూరు మునిసిపల్ జేఏసీ అధ్యక్షుడు

రాజధానిలో 10 ఎకరాలు కేటాయించాలి

ఎమ్మెల్యే గోరంట్లకు కడియం నర్సరీ రైతుల వినతి



ఎమ్మెల్యే గోరంట్లకు వినతిపత్రం అందజేస్తున్న కడియం నర్సరీ అసోసియేషన్ రైతులు

కడి యం, జూన్ 8(ఆంధ్రజ్యోతి): కడియం నర్సరీ రంగానికి తోడ్పాటు నిస్తూ అమరావతి ప్రాంతంలో బొటానికల్ గార్డెన్, బయోడైవర్సిటీ కేంద్రం ఏర్పాటుకు 10 ఎకరాల భూమిని కేటాయించాలని నర్సరీ సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరిని ఆదివారం నర్సరీ సంఘం అధ్యక్షుడు రత్నం అయ్యప్ప, ఉపాధ్యక్షుడు బోడపాటి గోపి కలిసి వినతిపత్రం అందించారు. అమరావతి ప్రాంతంలో కడియం నర్సరీరంగానికి 10 ఎకరాల భూమి కేటాయిస్తే థాయ్‌లాండ్ తరహాలో చాటుచక్ లాంటి మార్కెట్ ఏర్పాటు చేస్తామని, దీని ద్వారా నర్సరీరంగానికి చెందిన చిన్న, సన్నకారు రైతులు అభివృద్ధి చెందుతారన్నారు. ఈ కార్యక్రమంలో నర్సరీ సంఘ సభ్యులు కొండేపూడి నాగు, తాడాల నాగేశ్వరరావు, పిల్లా శ్రీను, గాద నాగేశ్వరరావు, కొవ్విడి వాసు తదితరులు ఉన్నారు.



పట్టుబడిన రేషన్ బియ్యం

రూ.13 లక్షల విలువైన పీడీఎస్ బియ్యం పట్టివేత

రాజానగరం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం లారీని రాజానగరంలో సివిల్ సప్లయిస్ అధికారులు పట్టుకున్నారు. ముందుగా అందిన సమాచారం మేరకు జాతీయ రహదారిలో బీపీసీఎల్ పెట్రోల్ బంకులో ఏపీ39 -వి3299 నెంబరు కలిగిన అశోక్ లేలాండ్ లారీ పార్క్ చేసి ఉండగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తనిఖీ చేసి పీడీఎస్ బియ్యం ఉన్న లారీని పట్టుకున్నట్టు రాజానగరం సివిల్ సప్లయిస్ డీటీ బాపిరాజు తెలిపారు. ఈ లారీ పల్నాడు జిల్లా నకిరేకల్లుకు చెందిన బెజ్జం రవీంద్రరెడ్డిదిగా గుర్తించామన్నారు.లారీ డ్రైవర్ పరారయ్యాడన్నారు.పట్టుబడిన లారీలో బస్తాలతో 28,090 కిలోలు బియ్యం ఉన్నాయని,వీటి విలువ రూ.12,92,140గా గుర్తించామన్నారు. లారీ విలువ రూ.20 లక్షలుగా నిర్ధారించామన్నారు. పరారీలో ఉన్న డ్రైవర్‌పై రాజానగరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు డీటీ తెలిపారు.


ప్రజల చెంతకు పాలన

పాలనలో ప్రభుత్వం నూతన ఒరవడి

- కలెక్టరేట్‌లో డీవీఏపీ యూనిట్
- నియోజకవర్గానికో యూనిట్
- 40 మంది ఉద్యోగుల నియామకం
- అభివృద్ధి, సంక్షేమ అంశాలు సేకరణ
- మౌలిక వసతులు, సమస్యలపై ఆరా
- 11న ప్రారంభోత్సవాలు
- 12న ఏడాది పాలన సంబరాలు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వం ఏర్పడి ఏడాది అవుతుంది. ఏడాది పాలన ఉత్సవాలను ఘనంగా నిర్వహించ నున్నారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం పాలనలో నూతన ఒరవడిని తెచ్చింది. ప్రభుత్వం ఏర్పడి ఈ నెల 12వ తేదీకి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా అనేక కార్యక్రమాలను చేపట్టనుంది. 11వ తేదీన జిల్లా వ్యాప్తంగా ఏడు నియోజక వర్గాల్లో పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్నారు. 12న అమరావతిలో ఘనంగా వేడుకలు నిర్వహించనున్నారు. ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేల సూచనల మేరకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల జాబితాలను అధికారులు సిద్ధం చేస్తున్నారు.ఇక సోమవారం నూతన ఒరవడికి శ్రీకారం చుడుతున్నారు.స్వర్ణాంధ్రప్రదేశ్ విజన్ యూ నిట్‌ను రాష్ట్ర స్థాయిలో, డిస్ట్రిక్ట్ విజన్ యూనిట్ జిల్లా స్థాయిలోనూ, నియోజకవర్గ విజన్ యూనిట్ నియోజక వర్గ హెడ్ క్వార్టర్‌లోనూ ప్రారంభించనున్నారు. ఒక్కో యూనిట్‌లో ఐదుగురు సచివాలయ ఉద్యోగులను నియమించారు. జిల్లా యూనిట్‌కు చైర్మన్‌గా కలెక్టర్ పి.ప్రశాంతి వ్యవహరిస్తారు. నియోజకవర్గ యూనిట్లకు ఎమ్మెల్యేలు చైర్మన్లుగా ఉంటారు. కన్వీనర్లుగా నియోజకవర్గ ప్రత్యేకాధికారులు ఉంటారు.జిల్లాలో రాజమండ్రి సిటీ, రాజమండ్రి రూరల్, రాజానగరం, అనపర్తి, కొవ్వూరు, నిడదవోలు, గోపాలపురం నియోజకవర్గాల హెడ్ క్వార్టర్లలోని మండల పరిషత్ కార్యాలయాల్లో నియోజకవర్గస్థాయి విజన్ యూనిట్లు ప్రారంభించనున్నారు. ఇక్కడ ఒక్కో యూనిట్‌కు ఐదుగురు వంతున సచివాలయ ఉద్యోగులు ఉంటారు. వీరిని నడిపించడానికి ఒక ప్రొఫెషనల్ ఉంటారు. మొదట వీరంతా తమ పరిధిలోని నియోజకవర్గాల్లో ఎంత జనం ఉన్నారు. ఏఏ పథకాలు ఎవరికి అందుతున్నాయి. ఇంకా అందుకోవాల్సిన వారెంతమంది అనే వివరాలు లెక్కిస్తారు.ప్రస్తుతం మండల స్థాయి వరకూ వివరాలు సేకరిస్తున్నారు. తర్వాత గ్రామ స్థాయి నివేదికలు ఇవ్వనున్నారు. ప్రస్తుత నివేదికలను జిల్లా విజన్ యూనిట్‌కు ఎప్పటికప్పుడు పంపిస్తున్నారు.వీటి ఆధారంగా ప్రజల జీవన ప్రమాణాలు, వారి ఆర్థిక పరిస్థితి,ఆయా ప్రాంతాల అభివృద్ధి, సమస్యలు, తదితర వివరాలు పొందుపర్చనున్నారు. ముందుగా ఆయా మండలాల్లో జరగాల్సిన పనులు కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తారు.



మండలస్థాయి విజన్ అమలు

జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో మండల స్థాయి విజన్ కార్యాచరణ ప్రణాళిక అమలు చేయనున్నట్లు కలెక్టర్ పి. ప్రశాంతి తెలిపారు. ఆయా ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో ఈ విజన్ యూనిట్లను ఏర్పాటు చేస్తు న్నామన్నారు. మొత్తం 40 మంది సచివాలయ ఉద్యోగులతో యూనిట్లు ఏర్పాటు చేస్తున్నామ న్నారు. 2024-29కి ఐదేళ్ల మండల విజన్ కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తామన్నారు. **- కలెక్టర్ ప్రశాంతి**

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ ప్రతిష్ఠాపన



కోరుకొండలో నిర్మించిన ఆలయంలో ప్రతిష్ఠించిన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి విగ్రహాలు

కోరుకొండ, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : కోరుకొండలో శ్రీ వల్లి దేవసేన సుబ్రహ్మణ్యేశ్వర నూతన ఆలయ ప్రతిష్ఠాపన ఆదివారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయంలో శ్రీ వల్లిదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి విగ్రహాలు, విఘ్నేశ్వర, అయ్యప్ప, మయూరం,నాగబంధంతో కూడిన విగ్రహాలను 50 అడుగల ఏకశిల ధ్వజస్తంభం, ఆలయ శిఖర ప్రతిష్ఠ ఆగమ పండితులు శాస్త్రోక్తంగా ప్రతిష్ఠించారు. గత మూడు రోజులుగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు ఆగమ బ్రహ్మలు పాణింగపల్లి సత్య పవన్‌కుమార్ ఆచార్యులు, బ్రహ్మశ్రీ ఇంద్రగంటి విశ్వనాథ శర్మలు బ్రహ్మత్వంలో దిగ్విజయంగా నిర్వహించారు. నిడమనూరి శ్రీ వెంకట ఆదినారాయణ దంపతులు పీటలపై కూర్చుని 3 రోజులు ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. రూ.2 కోట్లతో ఆలయాన్ని నిర్మించినట్టు నిర్వాహకులు తెలిపారు. ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ హాజరై రూ.5 లక్షలు విరాళం అందజేశారు. మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, యువజన నాయకుడు జక్కంపూడి గణేష్, స్వామివారిని దర్శించుకున్నారు. బీజేపీ నాయకుడు, విశ్వహిందూ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు స్వామివారిని దర్శించుకుని కార్తీక మాసం వచ్చేనాటికి రూ.25 లక్షల విలువైన బంగారు వేలాయుధంను సమకూరుస్తానని ప్రకటించారు. ఈ మేరకు రూ.లక్ష చెక్కును ముందుగా కమిటీ వారికి అందజేశారు. ఆదివారం జరిగిన అన్న సమారాధనకు ఒక టన్ను బియ్యం, రూ.1.50 లక్షలు విరాళం అందజేశారు. మాగంటి శ్రీనివాసులు రూ.5 లక్షలతో 50 అడుగుల ఏకశిలధ్వజస్తంభం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు ఉల్లి బుచ్చిబాబు, ఉపాధ్యక్షుడు బదిరెడ్డి దొర, వంటిపల్లి సత్యనారాయణ,తాడిహరిశ్చంద్రప్రసాద్ రెడ్డి, కటకం సత్యనారాయణ పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన గోగులమ్మ తిరునాళ్లు

రాజానగరం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): రాజానగరంలోని రావులచెరువు గట్టుపై కొలువై ఉన్న గోగులమ్మకు నిర్వహిస్తున్న తిరునాళ్లు ఆదివారంతో ఘనంగా ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా రెండు రోజులపాటు అమ్మవారికి ప్రత్యేకపూజలు, అభిషేకాలు,అర్చనలు, తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

కేఎస్ఆర్, కృష్ణంరాజును తక్షణం అరెస్టు చేయాలి

● రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కేఎస్ జవహర్‌కు దళిత జేఏసీ మహిళా నాయకుల వినతి


కొవ్వూరు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న కూటమి నాయకులు

కొవ్వూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): సాక్షి చానల్‌లో జరిగిన కేఎస్ఆర్ డిబేట్‌లో అమరావతి వేశ్యల రాజధాని అంటూ సీనియర్ జర్నలిస్టు కృష్ణంరాజు, కొమ్మినేని శ్రీనివాస్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ ఆదివారం అమరావతి దళిత జేఏసీ మహిళా నాయకులంతా రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కేఎస్ జవహర్ కలిసి వినతిపత్రం అందజేశారు. దళితుల మనోభావాలను కాపాడాలని, అమరావతి అభివృద్ధికి ఎటువంటి ఆటంకం కలగకుండా చూడాలని కోరారు. ఈ సందర్భంగా మేరుగ సరిత, అమరావతి దళిత జేఏసీ కన్వీనర్ చిలక బసవయ్య మాట్లాడుతూ రాజధాని మహిళలను కించపరిచినట్టు మాట్లాడటం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. దీనిపై జవహర్ స్పందిస్తూ కమిషన్ తరఫున తప్పకుండా చర్యలు తీసుకుంటామన్నారు. అమరావతి దళిత జేఏసీ మహిళలు పెద్దమాను కోటమ్మ, కంభంపాటి రాజేశ్వరి, మేరుగ రమణమ్మ పాల్గొన్నారు.

అసభ్య వ్యాఖ్యలు చేస్తే సహించం

దళితులు, మహిళల పట్ల అసభ్యకరంగా వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్ హెచ్చరించారు. ఈ మేరకు ఆయన ఆదివారం మాట్లాడుతూ ఫోర్త్ ఎస్టేట్‌గా వ్యవహరిస్తున్న సాక్షి చానల్ అమరావతిపై విషం కక్కడం దురదృష్టకరమన్నారు. ఈ సంఘటనపై కమిషన్‌కు ఫిర్యాదులు అందాయన్నారు. ఏ రిపోర్టు అయినా సరే ఎవరి మనోభావాలు దెబ్బతీయకుండా ఉండాలన్నారు.

అమరావతి మహిళలను కించపరచడం సరికాదు

సాక్షి మీడియాలోని కేఎస్ఆర్ షోలో సీనియర్ జర్నలిస్టు కృష్ణంరాజు అమరావతి మహిళల పట్ల అసభ్య పదజాలంతో మాట్లాడటం యావత్ రాష్ట్రాన్ని కలచివేసిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర అన్నారు. కేఎస్ఆర్, సీనియర్ జర్నలిస్టు కృష్ణంరాజు, సాక్షి మీడియా యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఆదివారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కూటమి నేతలు ఫిర్యాదు చేశారు. అమరావతి మహిళలను కించపరిచే విధంగా మాట్లాడటాన్ని ఖండించారు. దీనిపై వెంటనే వైసీపీ అధినేత జగన్మోహనరెడ్డి స్పందించి రాష్ట్రంలోని మహిళలకు క్షమాపణ చెప్పాలని బీజేపీ డిమాండ్ చేస్తుందన్నారు. మాజీ మున్సిపల్ చైర్మన్ సూరపనేని చిన్ని మాట్లాడుతూ ప్రతిపక్ష పార్టీ అధికార పార్టీ చేసే తప్పులను నిలదీయాలి తప్ప, మహిళలను కించపరిచేవిధంగా మాట్లాడటం సరికాదన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు పాలూరి నీలిమ, కిలాని వీర వెంకటలక్ష్మి, పిల్లలమర్రి మురళీకృష్ణ, బీజేపీ నేత పవన్, తదితరులు పాల్గొన్నారు.

కోటసత్తెమ్మకు విశేష పూజలు


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

నిడదవోలు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): తిమ్మరాజుపాలెంలో వేంచేసి ఉన్న కోటసత్తెమ్మ వారి దేవస్థానంలో ఆదివారం విశేష పూజలు నిర్వ హించారు. ఉదయం సుప్రభాత సేవతో ప్రారంభమై దూపహారతి, నిత్యార్చన, లలితా పారాయణం, సహస్రనామ కుంకుమ పూజలు చేశారు. ప్రత్యేక పూల అలంకరణలో ఉన్న అమ్మవారిని భక్తులు దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. పలు జిల్లాల నుంచి వచ్చినవారితో ఆలయం కిటకిటలాడింది. ప్రత్యేక దర్శనం, అన్నదాన విరాళాలు, ప్రసాద విక్రయాలు, పూజా టికెట్లు, ఇతర టికెట్ల ద్వారా మొత్తం రూ. 1,73,022 ఆదాయం లభించినట్టు దేవస్థానం సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి వి. హరి సూర్యప్రకాష్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ అండ్ చైర్మన్ దేవులపల్లి రవిశంకర్ తెలిపారు.

ఛత్రపతి శివాజీ ఆదర్శప్రాయుడు : నాగేంద్ర


హిందూ సామ్రాజ్య దినోత్సవంలో పాల్గొన్న ఆర్ఎస్ఎస్ నేతలు

కొవ్వూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : హిందూ సమాజానికి ఛత్రపతి శివాజీ మహరాజ్ ఆదర్శప్రాయుడని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర అన్నారు. ఛత్రపతి శివాజీ మహాసేన ఆధ్వర్యంలో ఆదివారం కొవ్వూరు ఒకటో వార్డు రాజీవ్‌కాలనీలో ఛత్రపతి శివాజీ మహరాజ్ పట్టాభిషేకం, హిందూసామ్రాజ్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఛత్రపతి శివాజీ మహాసేన వ్యవస్థాపకుడు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. నాగేంద్ర మాట్లాడుతూ హిందూ ధర్మాన్ని, సంస్కృతిని, సమాజాన్ని సంరక్షించిన వారిలో శివాజీ మహరాజ్ అగ్రగణ్యుడన్నారు. అనంతరం పలువురు మాట్లాడారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ నేతలు కొమ్ము సుబ్బారావు, గోలింగాచార్యులు, పిల్లలమర్రి మురళీకృష్ణ, శివరామకృష్ణ, సాయిరాజు, విజయభాస్కర్, పోణంగి పవన్, అడ్డూరి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సోమాలమ్మ జాతర


నందమూరులో కొలువైన అమ్మవారు

కొవ్వూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : నందమూరు గ్రామదేవత సోమాలమ్మ వారి జాతర మహోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఈ ఉత్సవాలు ముగింపు సందర్భంగా అమ్మవారికి గ్రామస్థులు మొక్కులు, నైవేద్యాలు సమర్పించారు. 12 సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే జాతర కావడంతో గ్రామస్థులు, బంధుమిత్రులను పిలుచుకుని భారీఎత్తున విందు భోజనాలను ఏర్పాటుచేశారు. దీంతో నందమూరు, చాగల్లురోడ్‌లో ట్రాఫిక్ స్తంభించిపోయింది. ఎండతీవ్రత అధికంగా ఉండడంతో ట్రాఫిక్‌లో చిక్కుకుని వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

● పెద్దాపురం జాతర మహోత్సవంలో ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు


ఎమ్మెల్యేకు స్వామివారి చిత్రపటాన్ని అందజేస్తున్న దృశ్యం

గోపాలపురం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. పెద్దాపురం గ్రామదేవత రేగులమ్మ వారి జాతర ముగింపు సందర్భంగా ఆదివారం ఆయన ఆ గ్రామానికి వెళ్లి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం భీమోలులో గణపతి, అయ్యప్ప, అభయాంజనేయస్వామి శిఖర జీవ ధ్వజ ప్రతిష్ఠలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఆధునిక ప్రపంచంలో మనిషి ప్రశాంతంగా గడిపే పరిస్థితి లేదన్నారు. ప్రస్తుతం సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రావడంతో ఉన్న సమయం చాలక పోటీ పడే పరిస్థితి నెలకొందన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రొంగల సత్యనారాయణ, ఏఎంసీ డైరెక్టర్ కూనపాము ప్రసాద్‌బాబు, సీనియర్ నేతలు కొర్లపాటి రాము, కొర్లపాటి అన్నవరం, వడ్లమూడి రమేశ్, కాట్రగడ్డ సురేశ్, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు కాకర్ల రామతులసి, క్లస్టర్ ఇన్‌చార్జి కాకర్ల బాబి, కాట్రగడ్డ సురేశ్, జ్యేష్ట శ్రీధర్, ముత్యాల రాయుడు, తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం : తహశీల్దార్


యోగాసనాలు వేస్తున్న ఉద్యోగులు

కొవ్వూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): నిరంతర యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని తహశీల్దార్ ఎం.దుర్గాప్రసాద్ అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర -2025 కార్యక్రమాన్ని ఆదివారం స్థానిక ఆంధ్రగీర్వాణ విద్యాపీఠం ప్రాంగణంలోని సంస్కృత కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఉదయం లేవగానే ఒక అరగంట పాటు యోగా చేస్తే ఆరోజంతా మనస్సు ప్రశాంతంగా ఉంటుందన్నారు. దీన్ని ఆచరణ తప్పకుండా పాటించాలని సూచించారు. అనంతరం పలువురు ఉద్యోగులు యోగాపై మాట్లాడారు. తర్వాత యోగా శిక్షకులు పెనుమత్స సరోజిని, యోగేంద్ర సదస్సులో పాల్గొన్న వారికి యోగాపై అవగాహన కల్పించి, యోగాసనాలు వేయించారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ కె. సౌజన్య, మున్సిపల్ ఉద్యోగులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

విజన్-47 ప్రణాళిక కార్యాలయం పరిశీలన


గోపాలపురంలో కార్యాలయాన్ని పరిశీలిస్తున్న జిల్లా జాయింట్ డైరెక్టర్ అప్పలకొండ

గోపాలపురం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని విజన్ - 2047 నియోజకవర్గ విజన్ ప్రణాళిక కార్యాలయాన్ని జిల్లా జాయింట్ డైరెక్టర్ లాలం అప్పలకొండ ఆదివారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విజన్‌ప్లాన్‌కు ఐదుగురు సచివాలయ సిబ్బందిని నియమించినట్టు తెలిపారు. రాబోయే ఐదు సంవత్సరాల్లో నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన సమాచారాన్ని సిబ్బంది సేకరిం చాలన్నారు. నియోజకవర్గంలోని వివిధ శాఖల నుంచి సమాచారం సేకరించి 2029 నాటికి పూర్తిస్థాయిలో అభివృద్ధి ప్రణాళికలు రచించటం జరుగుతుందన్నారు. కార్యాలయాన్ని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు త్వరలోనే ప్రారంభిస్తారని చెప్పారు. ఏఎస్‌వో వెంకటేశ్వరరావు, జూనియర్ అసిస్టెంట్ అనిల్, జిల్లా ప్రణాళిక శాఖ కార్యాలయ ప్రతినిధి ప్రదీప్, తదితరులు పాల్గొన్నారు.

అరుణ కుమారి నూతన నియామకం

పెరవలి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ క్రమశిక్షణ కమిటీలో మండలానికి చెందిన పార్టీ నాయకురాలు అరిగెల అరుణ కుమారిని సభ్యురాలిగా నియమించారు. ఈ మేరకు తనకు రాష్ట్ర కమిటీ నుంచి ఉత్తర్వులు వచ్చినట్టు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్‌గాంధీ, పీసీసీ అధ్యక్షురాలు షర్మిలా రెడ్డి, గిడుగు రుద్రరాజు, తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా, రాష్ట్ర స్థాయిలో పార్టీ పటిష్టతకు కృషి చేస్తానని తెలిపారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి : శేషారావు


చెక్కులు పంపిణీ చేస్తున్న శేషారావు

ఉండ్రాజవరం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర స్కిల్ డవలప్‌మెంట్ చైర్మన్ బూరుగుపల్లి శేషారావు పేర్కొన్నారు. ఆదివారం వేలివెన్నులో నియోజకవర్గంలోని లబ్ధిదారులకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన వారితో మాట్లాడుతూ పలువురు అనారోగ్యంతో బాధపడుతున్న వారిని ప్రైవేట్ ఆసుపత్రిలో వైద్యం చేయించుకున్న వారికి ఆర్థికసాయం అందజేస్తున్నట్టు చెప్పారు. మండలంలోని పిట్టల వేమవరం గ్రామానికి చెందిన గంటి సుధాకర్, అన్నవరప్పాడు గ్రామానికి చెందిన పాలపర్తి కృష్ణవేణిలకు చెక్కులను పంపిణీ చేశారు. ఆయా గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భారీ వృక్షానికి ఆకతాయిలు నిప్పు

● పెరవలి లాకుల సమీపంలోని ఇరిగేషన్ స్థలంలో...


ఆకతాయిలు నిప్పు పెట్టగా మిగిలిన మోడు , కాలిపోతున్న చెట్టు (ఇన్‌సెట్లో)

పెరవలి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ఒకవైపు చెట్లు పరిరక్షించాలని... పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు అంటూ ప్రభుత్వం ప్రచారం చేస్తూ రూ. కోట్లాది రూపాయలు ఖర్చు పెట్టి మొక్కలు నాటుతుంటే... మరోవైపు కొంతమంది స్వార్థపరులు, ఆకతాయిలు ఆ చెట్లకు నిప్పు పెడుతూ పర్యావరణానికి తూట్లు వేస్తున్నారు. వివరాల్లోకి వెళితే పెరవలి లాకుల సమీపంలోని ఇరిగేషన్ స్థలంలో గల ఒక భారీ వృక్షానికి కొంతమంది ఆకతాయిలు నిప్పుపెట్టడంతో అది నిలువునా కాలిపోయింది. ఈ దృశ్యాన్ని చూసిన స్థానికులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. ఎన్నో ఏళ్లగా విరగని చెట్టును ఒక అగ్గిపుల్లతో నేలకూల్చారని, ఇటువంటి ఆకతాయిలపై కఠిన చర్యలు తీసుకోవాలని వారంతా డిమాండ్ చేస్తున్నారు.

పార్టీకి, కౌన్సిలర్ల పదవులకు రాజీనామా చేయాలి


కొవ్వూరులో పాత్రికేయులతో మాట్లాడుతున్న రమేష్‌బాబు, తదితరులు

కొవ్వూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నుంచి కూటమిలో చేరుతున్న కౌన్సిలర్లు తమ ప్రాథమిక సభ్యత్వంతో పాటు కౌన్సిలర్ పదవులకు రాజీనామా చేయాలని వైసీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కంటమణి రమేష్‌బాబు అన్నారు. పట్టణంలోని వైసీపీ నియోజకవర్గ కార్యాలయంలో ఆదివారం పాత్రికేయులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొవ్వూరు మున్సిపాల్టీలో వైసీపీ నుంచి కౌన్సిలర్లుగా నెగ్గారు. ఇప్పుడు టీడీపీలోకి వెళ్తున్నప్పుడు విమర్శించడం తగదన్నారు. వైసీపీలో బీసీలకు అన్యాయం జరిగిందనడంలో వాస్తవం లేదన్నారు. పట్టణంలో శ్రీరామా సొసైటీపర్సన్ ఇన్‌చార్జిగా బీసీలకు చెందిన దేవగుప్తాపు లక్ష్మణరావు, అక్షయపాత్ర శ్రీనివాస రవీంద్ర, రుత్తల భాస్కరరావును నియమించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో చిట్టూరి అన్నవరం, గండ్రోతు అంజలీ, అంకోలు లిల్లీ, చీర అరుణ, మద్దిపట్ల సాయిగీత, నగళ్లపాటి శ్రీనివాస్, గంధం సాయి, తదితరులున్నారు.

చివటంలో అఖండ అన్నసమారాధన


పూజా కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే శ్రీనివాసనాయుడు

ఉండ్రాజవరం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): చివటంలో పుంతలో ముసలమ్మ, కనకదుర్గ అమ్మవారి ఆలయం వద్ద ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే జి. శ్రీనివాసనాయుడు అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం అఖండ అన్నసమారాధన నిర్వహించారు. భక్తుల సహాయ సహకారాలతో ఆలయ నిర్మాణం, విగ్రహాల ప్రతిష్ఠ రూ. 25 లక్షల వ్యయంతో నిర్మించడం జరిగిందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

జాన్‌పీటర్ జన్మదిన వేడుకలు


శుభాకాంక్షలు తెలుపుతున్న టీడీపీ కూటమి నాయకులు

దేవరపల్లి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): గౌరీపట్నం మేరీమాత పుణ్యక్షేత్రం డైరెక్టర్ జాన్‌పీటర్ జన్మదిన వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కొరారు ధృవకాంత్, ముప్పిడి భాస్కర్ కుమార్, ఎంఆర్‌పీఎస్ డైరెక్టర్ తాతాపూడి సురేశ్, కోడిసూరి, కొమ్మర నాగేంద్ర, రాపాక నాగరాజు, దేవరపల్లి నితిన్ శుభాకాంక్షలు తెలిపారు.

దళిత విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు


పురస్కారాలు అందుకున్న దళిత విద్యార్థులు

తాళ్లపూడి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో దళిత జేఏసీ ఏర్పాటు మంచి పరిణామమని, ఈ సందర్భంగా సేవా కార్యక్రమాలు చేయడం ద్వారా దళితుల అభివృద్ధికి మరిన్న కార్యక్రమాలు చేపట్టాలని పలువురు వక్తలు తెలిపారు. గజ్జరంలో దళిత జేఏసీ ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాలలో పదోతరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 22 మంది దళిత విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ. 1000 నగదు, పురస్కారాన్ని అందించారు. కార్యక్రమంలో మాజీఎమ్మెల్యే తలారి వెంకట్రావు, ఎంపీపీ జొన్నకూటి పోసిరాజు, గజ్జరం సర్పంచ్ గండా రాంబాబు, గూడా విజయరాజు, పిట్టా శ్రీను, బట్టు సుబ్బారావు, కొల్లి దుర్గారావు, తదితర దళిత జేఏసీ సభ్యులు పాల్గొన్నారు.

సీలేరు నదిలో అభిలాష్ మృతదేహం లభ్యం

మోతుగూడెం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మోతుగూడెంలో ఆదివారం పిక్నిక్‌కు వెళ్లి సీలేరు నదిలో కొట్టుకుపోయిన అభిలాష్ ధారాలమ్మ గుడి వెనక సీలేరు నదిలో ఆదివారం శవమై తేలాడు. శనివారం మధ్యాహ్నం ఒంటిగంట నుంచి గజఈతగాళ్లతో మోతుగూడెం ఎస్ఐ సాధిక్, తన సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి జి.మోహన్, ఆర్ఐ విగ్నేష్, వీఆర్వో రెవెన్యూ సిబ్బందితో గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. అయితే ఎట్టకేలకు ఆదివారం మధ్యాహ్నం నదిలోని రాయి మధ్యలో ఇరుక్కుపోయి ఉన్నాడు. గజ ఈతగాళ్లు, పోలీసులు మృతదేహన్ని ఒడ్డుకు తీసుకువచ్చారు. పోస్టుమార్టం నిమిత్తం చింతూరు గవర్నమెంట్ హాస్పటల్‌కి మృతదేహన్ని తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

లారీ ఢీకొని వ్యక్తికి గాయాలు

కొవ్వూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : జగ్గంపేటకు చెందిన అక్కిరెడ్డి దుర్గారావు ఈనెల 6వ తేదీన తన బైక్‌పై కొవ్వూరులోని స్నేహితుడ్ని కలవడానికి వస్తున్నాడు.ఈ క్రమంలో కొవ్వూరు రోడ్డు కం రైలు బ్రిడ్జి సమీపంలోని వెంకటేశ్వరస్వామి గుడి వద్దకు వచ్చేసరికి వెనుక వస్తున్న లారీ ఢీకొట్టడంతో గాయాలయ్యాడు. దీన్ని గమనించిన స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో వారు వచ్చి రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి వచ్చిన సమాచారం , దుర్గారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు పట్టణ హెడ్‌కానిస్టేబుల్ ఆర్. సాంబమూర్తి తెలిపారు.

ముగిసిన అభయాంజనేయుడి ఉత్సవాలు


చాగల్లు సెంటర్‌లో అన్నసమారాధన నిర్వహిస్తున్న దృశ్యం

చాగల్లు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని అభయాంజనేయ స్వామి వారి జయంత్యుత్సవాలు ఆదివారంతో వేడుకగా ముగిశాయి. ఈ సందర్భంగా స్థానిక సెంటర్‌లో భారీ అన్నసమారాధనను ఏర్పాటు చేశారు. అలాగే శిసాయిదిబ్బలో నూతనంగా బాల కనకదుర్గమ్మ వారి విగ్రహ ప్రతిష్ఠ జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఊనగట్ల శివారు అమ్మిగుంటలో పాటెమ్మ వారి ఆలయం పునః నిర్మాణం కార్యక్రమం వైభవంగా జరిగింది. మండలంలోని పలుగ్రామాల నుంచి భక్తులు వచ్చి ఆయా కార్యక్రమాలలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆయా ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సుబ్రహ్మణ్యం కుటుంబానికి...

మాజీ హోంమంత్రి వనిత పరామర్శ


లీలా కృష్ణప్రసాద్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న మాజీ హోంమంత్రి తానేటి వనిత, తదితరులు

నల్లజర్ల, జూన్8 (ఆంధ్రజ్యోతి): చీపురుగూడెంకి చెందిన జనసేన నేత చెల్లు సుబ్రహ్మణ్యం కుమారుడు లీలా కృష్ణప్రసాద్ కలుపు మందు పడి ఇటీవల మృతిచెందడంతో విషయం తెలుసుకున్న మాజీ హోంమంత్రి తానేటి వనిత ఆదివారం సుబ్రహ్మణ్యం కుటుంబ సభ్యులను వెళ్లి పరామర్శించారు. కార్యక్రమంలో మండల వైసీపీ అధ్యక్షుడు వెల్లంకి వెంకట సుబ్రహ్మణ్యం, చీపురుగూడెం వైసీపీ అధ్యక్షుడు చెల్లు హరిబాబు, కొరపాపటి హరిప్రసాద్, గాలింకి రాంబాబు, పెనుమాక వెంకటరత్నం, తలంశెట్టి నేతాజీ పాల్గొన్నారు.